

0933520440
09305978486
09794359502

PRAYAG TEERTH PUROHIT
KRISHNA SHASTRI
AND HIS SON
ORGD : BY BHAIYAN SHASTRI (BABU GARU)
32, Daragani Near Police station PRAYAGARAJ.
GANGARAM PRABHAULALJI & SONS



VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM

Postal License No. VSP / 96/ 2021 - 23

visit: www.visakhasamacharam.com


# విశాఖ సమాచారమ్


Sugar Free
Fitearly
రెండుపూటలా సేవించండి.
శక్తివంతంగా జీవించండి.
వివరములకు
8247526179
డీలర్లు కావలెను.



RNI No.52722/90 సంపుటి : 33 సంచిక : 261 విశాఖపట్నం, 02 ఆగస్టు 2023 బుధవారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00


## ఇది ఆణిముత్యంలాంటి ప్రాజెక్టు : సీఎం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆణిముత్యంలాంటి ప్రాజెక్టు... దేవుడి దయతో మరో మంచి కార్యక్రమం ఇక్కడ ప్రారంభమవుతుంది. విశాఖ అభివృద్ధికి మరింత దోహదం చేస్తూ... విశాఖపట్టణంలో ఆణిముత్యంగా నిల్చిపోయే మంచి ప్రాజెక్టుకు శంకుస్థాపనతో శ్రీకారం చుట్టాం. 17 ఎకరాల స్థలానికిగాను... 12-13 ఎకరాల పెద్ద విస్తీర్ణంలో మాల్ రావడం అన్నది కొన్ని చోట్లే ఉంటుంది.








**మారనున్న విశాఖ రూపురేఖలు....**

ఈ రోజు ఇక్కడ కడుతున్న మాల్ నిర్మాణం ద్వారా విశాఖపట్నం రూపురేఖలు మారడమే కాకుండా... దక్షిణ భారతదేశంలోనే పెద్ద మాల్ కానుంది. రూ.600 కోట్ల పెట్టుబడితో ఇంత పెద్ద విస్తీర్ణంలో మాల్ నిర్మాణం వల్ల... 8వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు లభిస్తాయి.

**ఫేజ్-2లో ఐటీ స్పేస్, ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్**

12 నుంచి 13 ఎకరాల్లో మాల్ నిర్మాణం పూర్తయిన తర్వాత.... మిగిలిన భూమిలో రాబోయే రోజుల్లో రెండో దశ ప్రాజెక్టులో భాగంగా ఇక్కడ రెండున్నర లక్షల ఎస్ఎఫ్టీతో ఐటీ స్పేస్ కూడా రాబోతుంది. అంతర్జాతీయ స్థాయిలో ఒక కన్వెన్షన్ సెంటర్ను కూడా నిర్మించనున్నారు. వీటన్నింటి ద్వారా ఇంకా ఉద్యోగఅవకాశాలు మెరుగవుతాయి. 2.50 లక్షల ఎస్ఎఫ్టితో ఐటీ స్పేస్ రావడం వల్ల మరో 3,000 మందికి ఉద్యోగ అవకాశాలు కూడా రానున్నాయి. ఇవన్నీ రాబోయే రోజుల్లో విశాఖపట్టణాన్ని అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టే కార్యక్రమాలు.

ఇంతకముందు వచ్చినప్పుడు ఆదానీ గ్రూపు ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న డేటాపార్కు, ఐటీ స్పేస్కు శంకుస్థాపన చేసుకున్నాం. అదే రోజు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ పనులకు కూడా శంకుస్థాపన చేశాం. అంతకన్నా ముందు శ్రీకాకుళంలో ఉత్తరాంధ్ర రూపురేఖలు మార్చే విధంగా మూలపేటలో పోర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేసుకున్నాం. ఇవన్నీ ఉత్తరాంధ్రా అభివృద్ధి రూపురేఖలను మార్చే గొప్ప అడుగులు. ఇనార్బిట్ మాల్ కూడా అలాంటిదే.

ఇవి కాకుండా రహేజా (మిగతా 2లో)

ఇదే రహేజా గ్రూపు హైదరాబాద్లో ఇనార్బిట్ మాల్ను 7-8 ఎకరాల్లోనే కడితే మనం 12-13 ఎకరాల విస్తీర్ణంతో పెద్ద మాల్కు ఇక్కడ శంకుస్థాపన చేసుకున్నాం.

ఈ కార్యక్రమాన్ని సాధ్యమయ్యేలా చేసిన నీల్ రహేజాకు, సీఈఓ రజనీష్ మహాజన్కు, సీఓఓ శ్రావణ్ కుమార్తో పాటు మిగిలిన అందరికీ రాష్ట్ర ప్రభుత్వం తరఫున, నా తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు.

## లోక్ సభలో ఢిల్లీ బిల్లు ప్రవేశపెట్టిన కేంద్రం

ఢిల్లీలో అధికారులు, సేవలపై ఎవరి పెత్తనం ఉండాలనే దానిపై సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును పక్కనబెట్టే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఇవాళ పార్లమెంటులో ఢిల్లీ సేవల బిల్లు ప్రవేశపెట్టింది. ఈ బిల్లులో ఢిల్లీని జాతీయ రాజధాని ప్రాంతంగా పేర్కొంటూ దీనిపై కేంద్రానికే పెత్తనం ఉండేలా బిల్లులో పలు అంశాల్ని ఉంచారు. దీనిపై విపక్షాలు మండిపడ్డాయి. కేంద్రం తీరు రాజ్యాంగ విరుద్ధంగా ఉందంటూ ఆగ్రహం వ్యక్తం చేశాయి.

ఢిల్లీలోని బ్యూరోక్రాట్లపై తన నియంత్రణను సుస్థిరం చేసుకునేందుకు ఉద్దేశించిన వివాదాస్పద బిల్లును కేంద్రం ఇవాళ లోక్సభలో ప్రవేశపెట్టింది. గవర్నమెంట్ ఆఫ్ నేషనల్ క్యాపిటల్ టెరిటరీ ఆఫ్ ఢిల్లీ (సవరణ) బిల్లు, 2023గా దీన్ని పేర్కొంది. దేశ రాజధానిలోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వానికి అనుకూలంగా



సుప్రీంకోర్టు తీర్పు తర్వాత కేంద్రం తీసుకొచ్చిన ఆర్డినెన్స్ను చట్టబద్ధం చేసేందుకు వీలుగా ఈ బిల్లును లోక్ సభలో ప్రవేశపెట్టింది.

కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రవేశపెట్టిన ఈ బిల్లు ఢిల్లీ అధికారుల పోస్టింగ్లు, బదిలీలపై నిబంధనలను రూపొందించడానికి కేంద్రానికి అధికారం ఇస్తుంది. దేశ రాజధాని అధికారుల సస్పెన్షన్లు, విచారణలు వంటి చర్యలు కూడా కేంద్రం నియంత్రణలో ఉంటాయి. ఫలితంగా ఈ బిల్లు ఢిల్లీ బ్యూరోక్రాట్లపై లెఫ్టినెంట్ గవర్నర్ కార్యాలయం, కేంద్ర నియామకం, నియంత్రణకు పనికొస్తుంది. ఈ బిల్లుపై ఆప్ మండిపడింది. ఈ బిల్లు దేశ రాజధానిలో ప్రజాస్వామ్యాన్ని బాబూక్రసీతో భర్తీ చేయడమే లక్ష్యంగా పెట్టుకుందని ఆరోపించింది.

కాంగ్రెస్, ఎస్పీ, ఆర్జేడీ, డీఎంకే సహా ఇండియా కూటమిలోని ఇతర విపక్ష పార్టీలన్నీ ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించాయి. రాజ్యాంగ విరుద్ధంగా, సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఈ బిల్లును కేంద్రం తీసుకొచ్చిందని విమర్శించాయి. సుప్రీంకోర్టు తీర్పును అపహాస్యం చేసేలా ఉన్న ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు పలువురు విపక్ష ఎంపీలు ప్రకటించారు. అలాగే అవిశ్వాసం పెండింగ్ లో ఉండగా ఇతర అంశాలపై చర్చలు చేపట్టకూడదన్న సంప్రదాయాన్ని కూడా కేంద్రం (మిగతా 2లో)

## అవిశ్వాసంపై చర్చకు ముహూర్తం ఖరారు

పార్లమెంట్ లో మణిపూర్ అంశంపై వరుసగా నిరసనలకు దిగుతున్న విపక్షాలు ఎట్టకేలకు అవిశ్వాస తీర్మానం రూపంలో ఎన్డీయే సర్కార్ ను ఇరుకునపెట్టబోతున్నాయి. ఈ పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో నిత్యం మణిపూర్ పై ఉభయసభలు నిరసనలతో అట్టుడుకుతున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ కేంద్రంలోని ఎన్డీయే సర్కార్ పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు నోటీసు ఇచ్చింది. దీన్ని అంగీకరించిన లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా చర్చకు తేదీలు ఖరారు చేశారు.

మణిపూర్ అల్లర్లపై ప్రధాని మోడీ మౌనవ్రతాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అవిశ్వాస తీర్మానం నోటీసును పరిగణనలోకి తీసుకున్న స్పీకర్ ఓం బిర్లా ఈ నెల 8 నుంచి మూడు రోజుల పాటు దీనిపై చర్చ నిర్వహించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఈనెల 8న మధ్యాహ్నం 12 గంటలకు



లోక్ సభలో చర్చ ప్రారంభం కానుంది. మణిపూర్ అల్లర్లకు కారణం, వాటిని అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యం, మహిళల నగ్న ప్రదర్శన వంటి అంశాలపై లోక్ సభ సుదీర్ఘంగా చర్చించబోతోంది. ఇందుకు తగ్గట్టుగా పార్టీల బలాబలాల ఆధారంగా వారి ఎంపీలు మాట్లాడేందుకు స్పీకర్ తగిన సమయం కూడా కేటాయించారు. చర్చ అనంతరం ఈనెల 10న ప్రధాని మోడీ సమాధానం చెబుతారు.

మణిపూర్ అంశంపై కేంద్రం మౌనంగా ఉండటంపై విపక్షాలు నిరసనలు చేపడుతుండటంతో (మిగతా 2లో)

## ప్రాజెక్టుల ఘనత మాదే-కరెంటు ఛార్జీలు తగ్గిస్తా

రాయలసీమ ప్రాజెక్టుల పర్యటన కోసం నంద్యాల జిల్లా నందికొట్కూరు చేరుకున్న టీడీపీ అధినేత చంద్రబాబు ఇవాళ పట్టణంలో రోడ్ షో నిర్వహించారు. భారీ ఎత్తున తరలివచ్చిన టీడీపీ కార్యకర్తల్ని ఉద్దేశించి మాట్లాడారు. ముందుచూపుతోనే ప్రాజెక్టులను తెలుగుదేశం చేపట్టిందని చంద్రబాబు తెలిపారు. కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల కోసం చేపట్టిన ప్రాజెక్టు హంద్రీనీవా అన్నారు. ప్రతి ఎకరాకు నీళ్లు ఇవ్వాలని సంకల్పించానని ఆయన గుర్తుచేశారు.

రాయలసీమ కోసం జగన్ ఏనాడైనా పనిచేశారా? అని చంద్రబాబు ప్రశ్నించారు. రాయలసీమకు ద్రోహం చేసిన వ్యక్తి జగన్ అన్నారు. రాయలసీమలో తాము రూ.12,400 కోట్లు ఖర్చు పెట్టామని, రాయలసీమ ద్రోహి ఖర్చు పెట్టింది రూ.2 వేల కోట్లేనన్నారు. సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసంపై యుద్ధభేరి ప్రకటించాలని వచ్చానన్నారు. రూ.10 లక్షలకోట్లు అప్పు



తెచ్చి.. రాయలసీమకు రూ.2 వేల కోట్లు ఖర్చు పెట్టారని చంద్రబాబు విమర్శించారు.

వైసీపీని భూస్థాపితం చేస్తే తప్ప మనకు న్యాయం జరగదని చంద్రబాబు పేర్కొన్నారు. వైసీపీని భూస్థాపితం చేస్తే తప్ప మనకు న్యాయం జరగదన్నారు. తెలుగుగంగ, ముచ్చుమర్రి ప్రాజెక్టులను టీడీపీనే ప్రారంభించిందని, ఎస్ఆర్బీసీ, హంద్రీనీవా ప్రాజెక్టులను టీడీపీనే ప్రారంభించిందన్నారు. నీళ్లు లేని ప్రాజెక్టులు చేసిన ఘనత చరిత్రహీనుడు ఈ సీఎంది అన్నారు. నాలుగున్నరేళ్లలో యువతకు ఒక్క ఉద్యోగమైనా ఇచ్చారా? అని చంద్రబాబు ప్రశ్నించారు.

రోడ్లుకు మట్టి వేయలేరుగానీ.. 3 రాజధానులు కడతారట అంటూ చంద్రబాబు ఎద్దేవా చేశారు. ఒక రాజధానిని నాశనం చేసి.. 3 రాజధానులంటున్నారన్నారు. మన రాజధాని ఏదంటే చెప్పుకోలేని దుస్థితిలో ఉన్నామన్నారు. పరదాల మాటున కాదు.. ధైర్యం ఉంటే ప్రజల్లోకి రా జగన్ అని సూచించారు. నందికొట్కూరుకు వచ్చి తాను అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పాలన్నారు. రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ అయినా జగన్ తీసుకొచ్చారా అని చంద్రబాబు ప్రశ్నించారు. ఉన్న పరిశ్రమలు కూడా పారిపోయే పరిస్థితి తీసుకొచ్చారన్నారు.

తాము రూ.1,200 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేశామని, భూమి రూ.5 లక్షలకు కొని రూ.60 లక్షలకు అమ్మడమే వీళ్ల పని అని చంద్రబాబు ఆరోపించారు. వైసీపీ పాలనలో నియోజకవర్గానికి ఒక సైకో తయారవుతున్నారని స్థానిక వైసీపీ నేత బైరెడ్డి సిద్దార్థ్ రెడ్డిని ఉద్దేశించి ఆరోపించారు. రౌడీయిజం చేస్తే తాటతీస్తానన్నారు. వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. పని చేయని వైసీపీ నాయకులను మురికి కాల్వలో ముంచేస్తే బుద్ధి వస్తుందన్నారు. బటన్ నొక్కుతున్నా అని జగన్ పదే పదే చెబుతున్నారని,

బటన్ నొక్కడం కాదు, బటన్ బుక్కుడు ఎక్కువైందన్నారు. పైన రూ.10 పంపిస్తారు.. కింద రూ.90 నొక్కుతున్నారన్నారు. (మిగతా 2లో)

### ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీపై

## పార్లమెంటులో బిజెపి ఎంపీ జీవీఎల్ ప్రశ్న



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** మే, 2023లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కోసం ప్రత్యేక ప్యాకేజీని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆమోదించిందా అని ఎంపీ రాజ్యసభలో జీవీఎల్ నరసింహా రావు అడిగిన ప్రశ్నకు,కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సమాధానమిస్తూ ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోసం ప్రత్యేక ప్యాకేజీని అందించిందని తెలియచేశారు.

కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థన మేరకు ఇటీవల 2014-15 ఆర్థిక సంవత్సరానికి రెవెన్యూ లోటు గ్రాంట్ క్రింద మే 19 వ తేదిన రూ.10,460.87 కోట్ల మొత్తాన్ని విడుదల చేసిందని మంత్రి తన సమాధానంలో పేర్కొన్నారు.

అంతేకాక రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్టిలో ఉంచుకుని ఆర్థిక మంత్రిత్వ శాఖ గత కొన్ని సంవత్సరాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న అధిక లోన్ల సర్దుబాటులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి కొంత ఉపశమనం కలిగించడం జరిగిందని మంత్రి సమాధానమిచ్చారు.

పోలవరం నీటిపారుదల ప్రాజెక్టుకు అదనపు నిధుల గురించి జీవీఎల్ ప్రశ్నించగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి పోలవరం నీటిపారుదల ప్రాజెక్టుకు ఇప్పటి వరకు రూ.14,970.09 కోట్ల నిధులను ఆర్థిక మంత్రిత్వ శాఖ వ్యయ శాఖ విడుదల చేసిందని మంత్రి సమాధానమిచ్చారు.

కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక సహాయం అందించినందుకు ప్రధానమంత్రికి జీవీఎల్ ధన్యవాదాలు తెలుపుతూ, ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఆంధ్ర ప్రదేశ్ ప్రజలపట్ల ఉన్న ప్రత్యేక శ్రద్ధను ఇది (మిగతా 2లో)

# (మొదటి పేజీ తరువాయిలు)

## ఇది ఆణిముత్యంలాంటి ప్రాజెక్టు: సీఎం జగన్

గ్రూపు దేశంలో పలుచోట్ల ఫైవ్ స్టార్ హొటళ్లు కట్టారు. అదే మాదిరిగా మన రాష్ట్రంలో రాజ్విలాస్ తరహాలో సూపర్ లగ్జరీ ఫైవ్స్టార్ ప్లస్, సెవెన్ స్టార్ హొటల్ కట్టబోతున్నారు. ఇప్పటికే ఒబెరాయ్, మేపెయిర్ హొటల్స్ గ్రూపు వాళ్లు కూడా కడుతున్నారు. ఆ తరహాలో రహేజా గ్రూపు కూడా సెవెన్ స్టార్ లగ్జరీ రిసార్ట్ నిర్మాణంలో మూడో గ్రూపు కానుంది. ఇవన్నీ విశాఖలో గొప్ప ప్రాజెక్టులుగా నిలుస్తాయి.

అదే విధంగా హిందూపూర్లో కూడా 350 ఎకరాల్లో ఎలక్ట్రానిక్స్, టెక్స్టైల్స్కు సంబంధించిన పార్కు రాబోతుంది. దానివల్ల మరో 15వేల ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. ఆ ప్రాజెక్టుకు కూడా అడుగులు ముందుకు వేశాము... యుద్ధ ప్రాతిపదికన అది కూడా టేకప్ చేస్తామన్నారు. దానికి కూడా ప్రభుత్వం సపోర్టు చేస్తుంది.

మీ అందరి ద్వారా రహేజా గ్రూపు అధ్యక్షుడు నీల్కు చెప్తున్నాను. మేము మీకు ప్రతి అడుగులోనూ తోడుగా ఉంటాం. కేవలం ఒక్క ఫోన్కాల్ దూరంలోనే మీకు అందుబాటులో ఉంటాం. ఈ విషయాన్ని మనసులో పెట్టుకుని... పెట్టుబడులు పెట్టండి. మిగిలిన రాష్ట్రాల కంటే మిన్నగా... ఏపీలో పారిశ్రామికవేత్తలకు ఏ విధంగా సహాయ, సహకారాలు అందిస్తామో మీరు కచ్చితంగా చూస్తారు. దేవుని దయవలన వీళ్లు మరింత బాగుపడి.. మన ప్రాంతంలో అభివృద్ధి జరగాలని ఆకాంక్షిస్తున్నాను.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, జిల్లా ఇన్చార్జి మంత్రి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని, రాష్ట్ర మంత్రులు ఆదిమూలపు సురేష్ బాబు, గుడివాడ అమర్ నాథ్, టిటిడి ఛైర్మన్ వై.వి. సుబ్బారెడ్డి, జిల్లా పరిషత్ అధ్యక్షులు జె. సుభద్ర, నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎంపి ఎంవివి సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ డా ఎ. మల్లికార్జున, జివియంసి కమీషనర్ సాయికాంత్ వర్మ, శాసన మండలి సభ్యులు వంశీ కృష్ణ శ్రీనివాస్ యాదవ్, వరదు కళ్యాణి, శాసన సభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, గణేష్ బాబు, తిప్పల నాగిరెడ్డి, అదీప్ రాజ్, ఉమా శంకర్ గణేష్, భాగ్యలక్ష్మి, రెడ్డి శాంతి, నెడ్ క్యాప్ ఛైర్మన్ కెకె రాజు, డిసిసిబి ఛైర్మన్ కోలా గురువులు, తదితరులు పాల్గొన్నారు.

## లోక్ సభలో ఢిల్లీ బిల్లు ప్రవేశపెట్టిన కేంద్రం

ఉల్లంఘించిందని విమర్శించారు.కేంద్రం మాత్రం రాజధానిలో పాలన సాఫీగా సాగేలా ఈ బిల్లు తెస్తున్నట్లు వెల్లడించింది.

## అవిశ్వాసంపై చర్చకు ముహూర్తం ఖరారు

వరుసగా ఉభయసభలు వాయిదా పడుతున్నాయి. అయినా కేంద్రం మాత్రం వెనక్కి తగ్గడం లేదు. విపక్షాల నిరసనతో కేంద్రం రాజ్యసభలో స్వల్పకాలిక చర్చకు మాత్రమే సిద్ధమైంది. దీంతో రూల్ 267 కింద చర్చ చేపట్టాలని ప్రధాని ప్రకటన చేయాలని విపక్షాలు పట్టుబట్టాయి. దీనికి కేంద్రం అంగీకరించకపోవడంతో విపక్షాల నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో లోక్ సభ స్పీకర్ ఇవాళ అవిశ్వాసంపై చర్చకు తేదీలు ప్రకటించారు.

కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టే అవిశ్వాస తీర్మానం నెగ్గే అవకాశాలు లేవు. ఇప్పటికే లోక్ సభలో భారీ మెజారిటీతో ఉన్న ఎన్డీయేకు తోడు వైసీపీ, బీజేడీ వంటి తటస్థ పార్టీల మద్దతు కూడా కేంద్రానికి ఉంది. దీంతో కేవలం ప్రధాని మోడీతో మణిపూర్ పై సమాధానం చెప్పించే లక్ష్యంతో ఈ అవిశ్వాస తీర్మానం పెట్టారు. ఈ చర్చ తర్వాత ప్రధాని మోడీ ఇచ్చే ప్రకటన ఆధారంగా విపక్షాలు తదుపరి కార్యాచరణ సిద్ధం చేసుకోబోతున్నాయి.

## ప్రాజెక్టుల ఘనత మాదే-కరెంటు ఛార్జీలు తగ్గిస్తా

విద్యుత్ ఛార్జీలు పెంచుకుంటూ పోతున్నారని, ఇప్పటికే 8 సార్లు పెంచారని చంద్రబాబు ఆరోపించారు. కొత్త విద్యుత్ పాలసీ తీసుకొస్తానని హామీ ఇచ్చారు. విద్యుత్ ఛార్జీలు తగ్గించే బాధ్యత తనదే అన్నారు. ఆడబిడ్డ నిధి కింద ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తానన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని, యువగళం సూపర్ హిట్ అయింది.. యువతలో చైతన్యం వచ్చిందన్నారు. 20 లక్షల కంటే ఎక్కువే ఉద్యోగాలు ఇస్తామన్నారు. జాబు రావాలంటే బాబు రావాల్సిందేనన్నారు. నాసిరకం మద్యం సరఫరాతో పేదల రక్తం తాగుతున్నారని వైసీపీ సర్కార్ పై విమర్శలు గుప్పించారు. పాత మద్యం విధానం తెచ్చి ధరలు తగ్గిస్తామన్నారు. నాసిరకం మద్యం నుంచి విముక్తి కలిగిస్తామన్నారు.

## ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీపై
## పార్లమెంటులో బిజెపి ఎంపీ జీవీఎల్ ప్రశ్న

స్పష్టంగా తెలియచేస్తుంది అనీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు అన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్రం పెద్దఎత్తున ఆర్థిక సహాయం చేసినప్పటికీ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తంగా నిర్వహించడంపట్ల ఎంపీ జీవీఎల్ అసంతృప్తి వ్యక్తం చేశారు.ఇది ప్రజా సంక్షేమంపై తీవ్ర ప్రభావం చూపుతుందని రాష్ట్ర ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు.

# జగనన్న సురక్ష"లో జిల్లాలో 3.50 లక్షల సేవలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** "జగనన్న సురక్ష" ద్వారా జిల్లాలో 522 సచివాలయాల పరిధిలో 5,28,814 కుటుంబాలకు సంబంధించి 3 లక్షల 59 వేల951 ధ్రువపత్రాలను జూలై నెలలో అందజేశారని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి తెలిపారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోజుకు సగటున పదివేల పత్రాలను అందించడం జరిగిందన్నారు. ఈ ప్రక్రియలో ఆయా శాఖల జిల్లా అధికారులతో పాటు మండల, గ్రామ సచివాలయ స్థాయి ఉద్యోగులను ఆయన అభినందించారు. ఈ క్రమంలో మూడు అంశాలను పరిష్కరించడం జరిగిందని వాటిలో మొదటిది అయిన ప్రభుత్వ పథకం అందుకోవడంలో మారుమూల గ్రామాల లబ్ధిదారులకు కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ అందుతున్నట్లు గుర్తించామన్నారు. వితంతు పింఛను పథకంలో సామాజిక, సాంకేతిక కారణాలవల్ల ఆలస్యం అవుతున్నట్లు గుర్తించారన్నారు. ఏ పథకానికైనా ధ్రువపత్రం ప్రామాణికమని దానిపై ముందుగా దృష్టి పెట్టడం జరిగిందన్నారు. వివిధ శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేసి అర్హులకు దృవపత్రాలు అందించడం విజయవంతంగా పూర్తి చేశారని ప్రశంసించారు.24 మండలాల్లో తాసిల్దార్లు ఎంపీడివో లు ప్రత్యేక అధికారులు నిబద్ధతతో పని చేశారన్నారు. సమస్యలు మిగిలి ఉన్నట్లయితే 1902 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేయాలన్నారు. ఈ సందర్భంగ వివాహ ధృవపత్రం రిజిస్ట్రార్ కార్యాలయం జారీ చేసినది కావాలంటున్నారని విలేకరులు చెప్పగా 60 రోజుల వరకు సచివాలయ ధృవపత్రం పనిచేస్తుందని వివరించారు. జిల్లాలో మొత్తం 3 లక్షల 61 వేల 880 అభ్యర్థనలలో 3,59,951 సేవాపరమైన వాటిలో 3,50,066 పరిష్కరించడం జరిగిందని 3,330 తిరస్కరించగా 6,555 అపరిష్కృతంగా (పెండింగ్) లో ఉన్నాయన్నారు. అర్థ వార్షిక పరిశీలనలో భాగంగా జగనన్న సురక్ష కార్యక్రమంలో పరిశీలన జరిగిందని చెప్పారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ స్మరణ్ రాజ్, జిఎస్ డబ్ల్యుఎస్ ప్రత్యేక అధికారి మంజులవాణి పాల్గొన్నారు

**పంచాంగం**

బుధవారం 02-08-2023
శోభకృత్ నామ సంవత్సరము
దక్షిణాయణం వర్షరుతువు
అధిక శ్రావణ మాసం

**తిథి :** బ. పాడ్యమి రా. 10.45

**నక్షత్రం :** శ్రవణం ప. 03.26

**వర్జ్యం :** రా. 07.07 ల 08.37

# సచివాలయం అడ్మిన్లు జేబులు నింపే ఆయుధాలా ?




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** మహా విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ జూన్ 3 లోని రెవెన్యూ అధికారిని అక్రమాలు ఎంత చెప్పుకున్న తక్కువే. జూన్ పరిధిలోని ఏ ఇంటిదగ్గరయినా. ఏ ఖాళీ స్థలం కైనా పన్ను కోసం దరఖాస్తు వచ్చిందంటే ఆమె జేబు నిండాల్సిందే. జీవీఎంసీ కి ఆదాయం వచ్చిన రాకపోయినా తన వ్యక్తిగత ఆదాయాన్ని మాత్రం జాగ్రత్తగా పాడుకుంటారని తన కార్యాలయంలోనే గుసగుసలాడుతున్నారు. దీనికి జోన్ పరిధిలోని సచివాలయాల్లో పనిచేస్తున్న అడ్మిన్లే కీలకం. వారందరినీ తన చెప్పు చేతల్లో పెట్టుకున్న సదరు అధికారిని దరఖాస్తు వచ్చిన వెంటనే నేరుగా కార్యాలయానికి కాకుండా, వారి ఇంటి వద్దకు కానీ లేదా తమ ఇంటికి రమ్మనమని బేరసారాలు కుదుర్చుకుంటారని సచివాలయ సిబ్బంది, చెవులు కోరుకొంటున్నారు. ఈ దరఖాస్తుకు ఎంత ఆ పన్ను వేయాలంటే అంత అని ముందుగానే లెక్కలు చెప్పేస్తారట. ఆయా మొత్తాలు చెల్లించడానికి సదరు దరఖాస్తుదారులు ఒప్పుకొని డబ్బులు అప్పగిస్తేనే పనులు ముందుకు సాగుతాయి లేదంటే ఆ దరఖాస్తులు బుట్ట దాకలు కావడం తప్పదని తెలిసింది. దీనికోసం నేరుగా ఏ దరఖాస్తుదారున్ని ఆమె కలవరు మాట్లాడరు. కనీసం ఫోన్ కాంటాక్ట్ కూడా చేయరు. చెప్పేది ఆమె కానీ చేసేదంతా సచివాలయ అడ్మిన్లే. కొంతమంది అడ్మిన్లు ఇందుకు నిరాకరించిన కూడా ఆమె ఊరుకోరు. తప్పనిసరిగా అక్కడ ఆమ్యామ్యాలు ఇవ్వాల్సిందే అంటూ ఒత్తిడి తేవడంతో లబ్ధిదారుడు ముడుపులు అందజేయడం తప్పడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారిని చెప్పిన పని చేయకపోతే ఏమవుతుందో అంటూ అడ్మిన్లు కూడా ఆమె చెప్పినట్టే చేస్తున్నట్లు సమాచారం. దీంతో సదరు అధికారిని పని సులువు అవుతుంది. ప్రతిరోజు ఇంటికి ఉత్త చేతులతో ఆమె వెళ్లరు. దరఖాస్తుదారులు జీవీఎంసీకి చలానా రూపంలో చెల్లించే మొత్తం కంటే అధికంగా ఆమెకు మొట్ట చెప్పాల్సిందే లేదంటే దరఖాస్తు బుట్టదాకలవుతుంది. ఇలా ప్రతి ఒక్క దరఖాస్తుదారుడుపై ఒత్తిడి చేస్తూ డబ్బులు దండుకోవడమే పరిపాటిగా మారింది.


# శ్వాసకోశ వ్యాధులకు ఉపశమనం

- 40 సంవత్సరాలు పైబడిన ప్రతీ ఒక్కరికి రక్తాన్ని సక్రమంగా ప్రసరించేలా చూసుకునే అవసరం ఉంది.
- మీ రక్తం నిర్ణీత వేగంతో శరీరంలోని ప్రతీ భాగానికి అందేలా చూసుకోవాలంటే మీకు వివిధ వన మూలికలతో కూడిన ప్రత్యేక ఔషధం సేవించవలసిన అవసరం ఉంది.

# కార్డోరియం ప్లస్




కావల్సిన వారు సంప్రదించండి:

9393949347

మన రక్త ప్రసరణను సమతుల్యం చేయడమే కాకుండా గుండెలోని రక్త నాళములు, మెదడు యందలి రక్త నాళములు మరియు శ్వాసకోశముల యందలి నాడులను ధృఢంగా చేస్తుంది. వీటిలో ఉండే అడ్డంకులను త్వరితంగా అరగదీస్తుంది. ఫలితంగా మీరు గుండెపోటు, పక్షవాతం, ఉబ్బసం వంటి వ్యాధులు రాకుండా నివారించుకోగలుగుతారు. ఇప్పటికే బాధపడుతుంటే సంపూర్ణంగా జయించగలుగుతారు.

అన్ని గ్రామాలలోను, పట్టణాలలోను ప్రైవేట్ ప్రాక్టీస్ నిర్వహించే ఆర్ఎంపీ, పీఎంపీ, డీఏఎంపీ, బీఏఎంఎస్, హోమియో, నేచురోపతి, ఆల్టర్నేటివ్ మెడిసిన్, బీపీటీ అర్హతలు కలిగిన వైద్యులు, సాంప్రదాయ మూలికావైద్యం చేయువారు డీలర్షిప్ కొరకు సంప్రదించండి.స్వయం ఉపాధి పథకం కింద అలకనందా ఉత్పత్తులు విక్రయించగోరువారు కూడా సంప్రదించండి.

90 రోజుల కోర్సు కేవలం రూ. 2700/- మాత్రమే.

మీరు వాడండి- మిగిలిన వారిచే కూడా వాడించండి.

అందరూ ఆరోగ్యంగా ఉండండి.



జనహిత ట్రస్ట్(రి)
9-3-16, పిఠాపురం కోలని,
విశాఖపట్నం- 530003
ఫోన్: 8247526179

Compli

వి-శాఖ సమాచారమ్

బుధవారం 02-08-2023

## పూర్ణ ఫలం

అంతర్యామికి సమర్పించే అర్చనా సామగ్రిలో అరటిపండు తప్పనిసరిగా ఉండి తీరుతుంది. ప్రకృతిలో ఎన్ని ఫలాలున్నా టెంకాయతో పాటు అరటిపండ్లకు ఎంతో ప్రాధాన్యం ఇస్తారు. గృహ ప్రవేశం, వివాహం, అన్ని విధాలైన వ్రతాలు, శుభకార్యాల్లో ప్రత్యేకంగా అరటిపండును వినియోగిస్తారు.

అరటిపండులో విత్తనాలు ఉండవు కనుక పూర్ణఫలం అంటారు. అరటిని 'కదళీ' అనే పేరుతోనూ పిలుస్తారు. ఇతర ఫలాలన్నింటిలోనూ విత్తనాలుంటాయి. పండుతిని లోపలి విత్తనాలను వదిలేస్తాం. అప్పుడవి ఎంగిలి విత్తనాలవుతాయి. వాటినుంచే మొక్కలు మొలిచి చెట్లయి కాయలు, పండ్లు ఏర్పడతాయి. అలా లభించిన ఫలాలు ఎంగిలిపూలే కదా! వాటిని పరమాత్మకు నివేదన చేయడం అపచారం అవుతుందని చాలామంది నమ్మకం. కానీ, అరటి బీజంలేని ఫలంగల చెట్టుగా భూలోకంలో పుట్టింది. అన్నికాలాల్లోనూ లభించే బీజరహిత ఫలం కనుక దీన్ని పూర్ణఫలం అన్నారు.

రామాయణంలో అరటిపండు ప్రస్తావన అనేక సందర్భాల్లో కనిపిస్తుంది. భాగవతంలో అరటి ఆవిర్భావం గురించిన కథ కూడా ఉంది. సృష్టిలో మొదట విరాట్ స్వరూపుడితో పాటు లక్ష్మి, దుర్గ, వాణి, సావిత్రి, రాధ అన్న పంచశక్తులు ఆవిర్భవించాయి.

సావిత్రి అందరి కన్నా తానే గొప్ప సౌందర్యవతినన్న అహంకారంతో ప్రవర్తించేది. అది గమనించిన విరాటమూర్తి ఆమెను బీజంలేని చెట్టుగా భూలోకంలో జన్మించమని శపించాడు. ఫలితంగా ఆమె 'కదళి' పేరుతో భూలోకంలో అరటి చెట్టయి పుట్టింది. తన శాప పరిహారం కోసం అయిదువేల సంవత్సరాలు ఘోర తపస్సు చేసింది. విరాటమూర్తి ప్రత్యక్షమై ఆమెకు పుణ్యలోక ప్రాప్తిని కలిగించాడు. అంతేకాక, ఆమె అంశను మాధవ, మానవసేవ నిమిత్తం భూలోకంలో శాశ్వతంగా ఉంచవలసిందిగా ఆదేశించాడు. విరాటమూర్తి ఆదేశం పొందిన పర్వదినమే మాఘ బహుళ చతుర్దశి. దీనికున్న మరో పేరు 'అరటి చతుర్దశి'.

అరటి ప్రాముఖ్యంతో పాటు, దాని పూజా విధానాన్ని సైతం భరద్వాజ మహర్షి సీతారాములకు వివరించినట్లు రామాయణంలో కనిపిస్తుంది. అరటి పిలకను, చెట్టును కొన్ని ప్రాంతాల్లో పూజిస్తారు. పసుపు, కుంకుమలతో, పూలమాలలతో అరటిచెట్టును. అలంకరిస్తారు. దీపారాధన చేస్తారు. ధూపమిచ్చి పెసరపప్పు, బెల్లం, తులసిదళాలు నైవేద్యంగా సమర్పిస్తారు. అయిదుగురు ముత్తయిదువులను పిలిచి, భోజన తాంబూలాదులతో సత్కరించి అరటిపండ్లు దానంగా ఇస్తారు. పూజ చేసినవారు మధ్యాహ్నం భోజనం చేయరు. సాయంత్రం చంద్రదర్శనం తరవాతే భోంచేస్తారు. సత్సంతానం కోసం అరటిపూజ చేస్తారంటారు.

రామాయణంలో సీతారాములు అరటిపూజ చేసినట్లు తెలుస్తోంది. రావణవధానంతరం సీతారాములు భరద్వాజాశ్రమంలో విడిది చేశారు. అందరికీ అరిటాకుల్లో వడ్డించారు. తినడానికి ఉపక్రమించే సమయంలో హనుమకు అరటి ఆకు మిగల్లేదు. శ్రీరాముడు తన కుడివైపున మారుతిని కూర్చుండబెట్టుకొని, తన ఆకులోనే ఓ పక్కన అతడికి వడ్డించమని చెప్పాడు.

శ్రీరాముడికి, అంజనేయుడికి చేసే పూజలో అరటి ఆకులో అరటిపండ్లు అర్పించేవారి వంశం అభివృద్ధి చెందుతుందని కొందరి నమ్మకం.

అరటి ఆకులో చేసే భోజనం ఆయుష్షును పెంచుతుందంటారు.

అరటిచెట్టులోని ప్రతి భాగం ఎంతో పవిత్రమైంది. ఆరోగ్యప్రదమైంది.

అరటి ఆకు భోజనం అతిథులకెంతో ఆనందం కలిగిస్తుంది.

అరటి బోదెలలో దీపాలు వెలిగిస్తారు.

అరటిపువ్వును కాయలను కూరలకు వినియోగిస్తారు.

తాంబూలంలో రెండేసి అరటిపండ్లు ఉంచి పెద్దలకు సంభావనగా ఇస్తారు.

అరటిపండు మంచి ఆరోగ్యకర ఆహారం.

అరటిచెట్లతో కల్యాణమండపాలను అలంకరిస్తారు.

## హర్యానాలో హింస.. రెండు వర్గాల మధ్య ఘర్షణల్లో నలుగురి మృతి



మణిపూర్ మంటలు చల్లారాయని అనుకునేలోపే.. హర్యానాలో హింస చెలరేగింది. సోమవారం నుహ్ జిల్లాలో రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ గొడవల్లో నలుగురు చనిపోగా, 30 మందికి పైగా గాయపడ్డారు. దీంతో నుహ్ జిల్లాలో పోలీసులు కర్ఫ్యూ విధించారు. ప్రస్తుతం అక్కడ తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఘర్షణల వెనుక కుట్ర కోణం ఉందని అనుమానిస్తున్నామని రాష్ట్ర మంత్రి అనిల్ విజ్ అన్నారు.

'బ్రిజ్ మండల్ జలాభిషేక్ యాత్ర'ను సోమవారం విశ్వ హిందూ పరిషత్ చేపట్టింది. అయితే గురుగ్రామ్ - అల్వార్ నేషనల్ హైవే వద్దకు యాత్ర చేరుకోగానే ఓ వర్గం యువకులు అడ్డుకున్నారు. దీంతో ఇరువైపులా ఘర్షణ చోటు చేసుకుంది. ఈ గొడవల్లో ఇద్దరు హోంగార్డులు చనిపోయారు. ప్రభుత్వ, ప్రైవేటు వాహనాలకు అల్లరి మూకలు నిప్పుపెట్టాయి. సాయంత్రానికి పలు ప్రాంతాలకు ఈ హింస వ్యాప్తి చెందింది.

ఈ ఘటన నేపథ్యంలో నుహ్ లోని నల్హర్ మహదేవ్ మందిర్ లో 2,500 మందికి పైగా చిక్కుకుపోయారు. ఈ గుడిలో ఉన్న వారిని టార్గెట్ చేసుకుని అల్లరి మూకలు రాళ్ల దాడికి దిగాయి. సమీపంలోని కొండపైకి ఎక్కి కాల్పులు జరిపాయి. దీంతో కొన్ని గంటలపాటు లోపల ఉన్న వారు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ గడిపారు. తర్వాత పోలీసులు వారిని కాపాడారు. ఈ ఘటన జరిగిన కొద్దిసేపటికి ఓ వర్గం కట్టడానికి ఆందోళనకారులు నిప్పు పెట్టారు.

ఈ ఘటనలకు సంబంధించి 20 మందికిపైగా పోలీసులు అరెస్టు చేశారు. ఘర్షణల్లో ఇప్పటిదాకా నలుగురు చనిపోగా, 30 మందికి పైగా గాయపడ్డారు. సోహ్నా మనేశ్వర్, పటౌడి ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవల్ని నిలిపేశారు. ఇద్దరు యువకుల్ని హత్య చేసిన కేసులో ప్రధాన నిందితుడు మోనూ మనేసరే ఈ ఘర్షణలకు కారణమని ఆరోపణలు వస్తున్నాయి. వీహెచ్‌పీ నిర్వహించిన కార్యక్రమానికి అతడు హాజరవుతున్నాడని తెలియడంతోనే అటువైపు వర్గం వారు అడ్డుకున్నట్లు సమాచారం.

# అభివృద్ధి పథంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆంధ్రవిశ్వవిద్యాలయానికి మంగళవారం మధ్యాహ్నం రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన రెడ్డి విచ్చేసారు. వర్సిటీలో ఐదు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. మంగళవారం మధ్యాహ్నం 01.39 గంటలకు సిరిపురం వద్దనున్న ఫార్మ ఇంక్యుబేషన్, బయో మానిటరింగ్ హబ్- ఎలిమెంట్ కి చేరుకున్నారు. ఎలిమెంట్ భవనాన్ని ప్రారంభించిన అనంతరం అదే వేదిక నుంచి మరో నాలుగు భవనాల శిలాఫలకాలను ఆవిష్కరించి ప్రారంభించారు.

గత మూడు సంవత్సరాలుగా ఆంధ్రవిశ్వవిద్యాలయంలో 18 ప్రాజెక్టులు చేపట్టగా, వీటిలో ఐదు ప్రాజెక్ట్ లను మంగళవారం ముఖ్యమత్రి చేతుల మీదుగా ఆరంభించారు. అవి టెక్ స్టార్టప్ ఇంక్యుబేషన్ 'సెంటర్' ఆ హబ్, ఫార్మ ఇంక్యుబేషన్ ఎలిమెంట్, ఏయూ డిజిటల్ జోన్ అండ్ స్మార్ట్ క్లాస్రూం కాంప్లెక్స్' అల్గారిథమ్, ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్(ఏయూ సిబ్), ఏయూ అవంతి ఆక్వా కల్చర్ ఇన్నొవేషన్ స్కిల్ హబ్లను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో యువతను ఆవిష్కర్తలుగా తీర్చిదిద్దడానికి ఉపయుక్తంగా నిలిచే ఈ ఐదు కేంద్రాల ప్రత్యేకతలను, పనితీరు, ప్రగతిని ఏయువిసి ఆచార్య పీవీ జి డి ప్రసాద్ రెడ్డి స్వయంగా ముఖ్యమంత్రి కి వివరించారు. ఎలిమెంట్ భవనంలో ఏర్పాటుచేసిన ఫార్మసీ లేబరేటరీని ముఖ్యమంత్రి పరిశీలించి అక్కడ ఉన్న ఉపకరణాలు పనితీరు తెలుసుకున్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో 130 కోట్ల రూపాయల వ్యయంతో విద్యార్థులకు ఉపయుక్తంగా అభివృద్ధి చేసిన భవనాలు ప్రాజెక్టులను ప్రారంభించడం పట్ల ముఖ్యమంత్రి సంతోషం వ్యక్తం చేశారు.

రానున్న మూడు సంవత్సరాల కాలంలో 300కు పైగా సాఫ్ట్వేర్ సంస్థలు ఏయూ క్యాంపస్ వేదికగా పనిచేయడం లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ముఖ్యమంత్రికి ఆచార్య ప్రసాద్ రెడ్డి వివరించారు. ప్రభుత్వపరంగా దీనికి అవసరమైన సహకారం అందిస్తామని ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి భరోసా అందించారు.

**ముఖ్యమంత్రిని ఆహ్వానించిన విసి ప్రసాదరెడ్డి....**

ఆంధ్ర విశ్వవిద్యాలయ పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ప్రసాదరెడ్డి చిరునవ్వుతో సాదరంగా ఆహ్వానించారు. పర్యావరణహితాన్ని కోరుకుంటూ ముఖ్యమంత్రి కి మొక్కను అందించి ఆహ్వానం పలికారు.

**ముఖ్యమంత్రికి స్వాగతం పలికిన విద్యార్థులు.....**

ఆంధ్ర విశ్వవిద్యాలయానికి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్



జగన్మోహన్ రెడ్డికి ఆ విశ్వవిద్యాలయం విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. ఎలిమెంట్ భవనం వద్ద సుమారు 1000 మంది విద్యార్థులు ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి వాహనం నుంచి. దిగగానే విద్యార్థులు వెల్కమ్ సీఎం సార్ అంటూ ఘనస్వాగతం పలికారు. విద్యార్థుల అపూర్వ స్వాగతానికి ముఖ్యమంత్రి అమితమైన సంతోషాన్ని వ్యక్తం చేశారు. విద్యార్థులకు నమస్కరిస్తూ చిరునవ్వుతో వారికి అభివాదం చేస్తూ పలకరించారు.

కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ వై వి సుబ్బారెడ్డి, విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడుదల రజని, ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ , ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కే హేమచంద్ర రెడ్డి, ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జె.స్యామలరావు, ఏయూ రెక్టర్ ఆచార్య కె. సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, అవంతి ఫీడ్స్ అధినేత ఇంద్ర కుమార్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ మల్లికార్జున, జీవి ఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ విశ్వనాధన్, ఏయూసెనేట్ సభ్యులు డాక్టర్ కుమార్ రాజా, ప్రిన్సిపాల్ ఆచార్య పై రాజేంద్రప్రసాద్, కె. శ్రీనివాసరావు, జి.సషి భూషణరావు, ఏ నరసింహారావు, టి. శోభ శ్రీ ఎస్. కె భట్టి, అంబేద్కర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం. జేమ్స్ స్టీఫెన్, incubation సెంటర్ సీఈవో రవి ఈశ్వరపు, ఆచార్య కృష్ణ మంజరి పవర్, టి.షారోన్ రాజు ఆచార్య ఎన్ఎడీ పాల్, ఆచార్య కె. బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏయు ప్రిన్సిపల్స్, ఇతర అధికారులను ముఖ్యమంత్రి కి వీసి ప్రసాద్ రెడ్డి స్వయంగా పరిచయం చేశారు. ఎలిమెంట్ భవనం బయట పెద్ద సంఖ్యలో విద్యార్థులు ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు. వీరికి ముఖ్యమంత్రి చిరునవ్వుతో అభివాదం చేస్తూ పలకరించారు.

**ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ముఖ్యమంత్రి ప్రారంభించిన ఐదు ప్రాజెక్టుల వివరాలు...**

**ఆ హబ్ ....** ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ విద్యార్థులను ఆవిష్కర్తలుగా, భవిష్యత్ పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే వేదికగా ఆ హబ్ని తీర్చిదిద్దారు. ఇంజనీరింగ్ కళాశాలలో 30 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ 21 కోట్ల వ్యయంతో దీనిని నిర్మించారు. దీనిలో ఇప్పటికే 121 స్టార్టప్లు పనిచేస్తూ వీటిలో 114 వరకు ఆర్థిక వనరులను సృష్టించే స్థాయికి చేరుకున్నాయి.

**ఎలిమెంట్.....** ఫార్మ ఇంక్యుబేషన్, బయోలాజికల్ మానిటరింగ్ హబ్గా ఎలిమెంట్ను ఏర్పాటు చేసారు. దాదాపు 55 వేల సదరపు అడుగుల విస్తీర్ణంలో ఫార్మ, బయో, జినోమిక్స్ ఇంక్యుబేషన్, టెస్టింగ్ ల్యాబ్గా దీనిని దాదాపు 44 కోట్ల రూపాయలతో దీనిని ఏర్పాటు చేసారు. ఔషధ రంగాలలో స్టార్టప్ ఇన్నొవేషన్ ని ప్రోత్సహించే విధంగా ఎలిమెంట్ ఏర్పాటు చేసారు.

**అల్గాం......** ఆంధ్రవిశ్వవిద్యాలయం డిజిటల్ జోన్, స్మార్ట్ క్లాస్రం కాంప్లెక్స్ను అల్గారిథంగా పేరు పెట్టారు. 'ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం ఎదురుగా 60 వేల చదరపు అడుగుల విస్తీర్ణంతో రూ 35 కోట్ల వ్యయంతో దీనిని నిర్మించడం జరిగింది. ఈభవనంలో 250 మంది కూర్చునే సామర్థ్యం కలిగిన సెమినార్ హాళ్లు 2, స్మార్ట్ క్లాస్ రూమ్లు 15, ఆన్లైన్ పరీక్షల నిర్వహణకు ఉపయుక్తంగా 500 కంప్యూటర్లతో కూడిన ఒక పూర్తి అంతస్తును కలిగి ఉంది.

ఏయూ ....ఆంధ్రయూనివర్సిటీ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్( ఏయూ సిబ్)ని ఏయూ అవుట్లెట్గా అనుకుని ఏర్పాటు చేసారు. 25వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ భవనం నిర్మాణానికి రూ. 15 కోట్లు ఖర్చుచేసారు. ఐఐఎం విశాఖపట్నంతో అవగాహన ఒప్పందం చేసుకుని ఏయూ సిబ్ నుంచి ఎంబిఏ కోర్సును నిర్వహిస్తున్నారు. ఇంటర్నేషనల్ బిజినెస్, అనలటిక్స్ రంగాలలో బ్యాచిలర్, పీజీ కోర్సులకు ఈ కేంద్రంలో నిర్వహిస్తారు.

**ఏయూ అవంతి....** బీచ్రోడ్డులో ఏయూ అవంతి ఆక్వాకల్చర్ ఇన్నొవేషన్ అండ్ స్కిల్ హబ్ ని 12 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసారు. తొలి దశలో దాదాపు రూ 11 కోట్ల వ్యయంతో దీనిని ఏర్పాటు చేసారు. అవంతి ఫౌండేషన్తో చేసుకున్న అవగాహన ఒప్పందంలో భాగంగా మెరైన్ ఫార్మింగ్ రగంలో నైపుణ్య శిక్షణ, ఎంటర్ప్రెన్యూర్షిప్ ప్రోత్సహించే దిశగా ఈ కేంద్రం సేవలు అందిస్తుంది.

# మిషన్ మోడ్‌లో జగనన్న సురక్ష కార్యక్రమం అమలు

**కాకినాడ, (విశాఖ సమాచారమ్):** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా కాకినాడ జిల్లాలో మిషన్ మోడ్‌లో 2,68,326 సేవా విజ్ఞప్తులను పరిష్కరించినట్లు కలెక్టర్ డా. కృతికా శుక్లా తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ స్పందనహాల్‌లో జగనన్న సురక్ష కార్యక్రమంపై ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కలెక్టర్ కృతికా శుక్లా.. డీఆర్వో కె.శ్రీధర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి జూన్ 23వ తేదీన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారని.. ఇది జులై 31 వరకు కొనసాగినట్లు తెలిపారు. నూటికి నూరు శాతం సంతృప్తి స్థాయిలో పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందించడంతో పాటు ప్రజలకు అవసరం మేరకు 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందించేందుకు ఈ కార్యక్రమాన్ని అమలుచేసినట్లు వివరించారు. జిల్లాలోని 620 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి.. సేవలు అవసరమైన వారిని గుర్తించారని.. టోకెన్ల జారీ అనంతరం సర్వీస్ రిక్వెస్టులను సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయించినట్లు తెలిపారు. ప్రజల సమస్య పరిష్కారానికి, వివిధ రకాల సర్టిఫికెట్లను అందించేందుకు అవసరమైన డాక్యుమెంట్లు తీసుకొని దగ్గర ఉండి మరి దరఖాస్తులను నింపినట్లు వివరించారు. జులై 1వ తేదీ నుంచి మండల స్థాయి అధికారులైన తహసీల్దారు, ఈవోపీఆర్‌డీ ఒక ఒక టీమ్‌గా.. ఎంపీడీవో, డిప్యూటీ తహసిల్దార్ మరో టీమ్‌గా ఏర్పడి ప్రతి సచివాలయం పరిధిలో పూర్తిగా ఒకరోజు ఉండేలా జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహించి.. సర్టిఫికెట్లను, సేవలు అందించినట్లు కలెక్టర్ తెలిపారు.

**1,23,687 ఇంటెగ్రేటెడ్ సర్టిఫికెట్ల జారీ:**

సాధారణంగా జిల్లాలో నెలకు సగటున 10 వేల నుంచి 11 వేల వివిధ రకాల సర్టిఫికెట్లను అందించడం జరుగుతోందని.. అయితే నెల రోజుల పాటు జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మిషన్ మోడ్‌లో 2.30 లక్షలకుపైనే ఉచితంగా సర్టిఫికెట్లు అందించడం జరిగిందని.. ఇది గొప్ప విజయమని పేర్కొన్నారు. ఎవరూ తహసీల్దార్, ఎంపీడీవో, ఇతర



కార్యాలయాలకు వెళ్లనవసరం లేకుండా వారి ఇళ్ల వద్దే సర్టిఫికెట్లు, సేవలు అందించినట్లు వెల్లడించారు. అర్హత ఆధారంగా దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిష్కరించినట్లు తెలిపారు. 1,23,687 ఇంటెగ్రేటెడ్ క్యాస్ట్ సర్టిఫికెట్లు, 1,13,653 ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్లు జారీచేసినట్లు వెల్లడించారు. అదే విధంగా ఆధార్ కార్డుతో మొబైల్ నంబర్ అనుసంధానానికి సంబంధించి 10,911 దరఖాస్తులను పరిష్కరించినట్లు వివరించారు. రైస్ కార్డులోని సభ్యుల విభజన, సభ్యుల చేర్పులకు సంబంధించి 2,459 దరఖాస్తులను పరిష్కరించినట్లు తెలిపారు. అదే విధంగా మండలాలు, పరిష్కరించిన దరఖాస్తుల సంఖ్యను పరిగణనలోకి తీసుకుంటే కాకినాడ అర్బన్ (29,703), ప్రత్తిపాడు (24,060), తాళ్లరేవు (15,736), కాజులూరు (15,085), కాకినాడ రూరల్ (15,067) తొలి అయిదు స్థానాల్లో నిలిచినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు సైతం కీలక భాగస్వామ్యం అందించారని.. అదే విధంగా ప్రజాప్రతినిధులకు క్షేత్రస్థాయి నుంచి అందిన ఫిర్యాదులను జేకేసీలో నమోదు చేయడం జరిగిందని.. వాటిని కూడా త్వరితగతిన పరిష్కరించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

**జేకేసీ కింద 5,076 గ్రీవెన్స్‌లు:**

జగనన్నకు చెబుదాం (జేకేసీ-1902) కార్యక్రమాన్ని గౌరవ ముఖ్యమంత్రి 2023, మే 9న ప్రారంభించారని.. అప్పటి నుంచి చూస్తే ఆగస్టు 1వ తేదీ వరకు ఈ కార్యక్రమం కింద మొత్తం 5,076 గ్రీవెన్స్‌లు నమోదయ్యాయని.. వీటిలో 84 శాతం అర్జీలను పరిష్కరించినట్లు తెలిపారు. సంతృప్తికరంగా లేని 55 గ్రీవెన్స్‌లను పరిష్కారం నిమిత్తం పైఅధికారులకు పంపించినట్లు వెల్లడించారు. ఎక్కువగా రెవెన్యూ, ఈపీడీసీఎల్, పంచాయతీరాజ్, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, హౌసింగ్, పోలీస్ శాఖల పరిధిలో అర్జీలు వచ్చినట్లు వివరించారు. రెవెన్యూకి సంబంధించి ఎక్కువగా సివిల్ వివాదాలపై అర్జీలు వస్తున్నందున మండలస్థాయిలో తహసీల్దార్, సీఐ, ఈవోపీఆర్‌డీలతో ప్రత్యేకంగా కమిటీ ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ప్రతి మంగళవారం ప్రత్యేకంగా ఈ బృందం సమావేశమై సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నట్లు వెల్లడించారు. మండలస్థాయిలో పరిష్కారం కాని సమస్యలను జాయింట్ కలెక్టర్ నేతృత్వంలోని జిల్లాస్థాయి కమిటీ పరిశీలనకు వెళ్తున్నట్లు తెలిపారు. అక్కడ సమగ్ర పరిశీలన అనంతరం తగిన నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు. వానలకు ముందు ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో లోవోల్టేజ్, విద్యుత్ సరఫరా అంతరాయాలు చోటుచేసుకున్న నేపథ్యంలో ఈపీడీసీఎల్ పరిధిలో కొన్ని అర్జీలు నమోదైనట్లు తెలిపారు. పంచాయతీరాజ్‌కు సంబంధించి డ్రెయిన్ల పూడికతీత, వీధిలైట్లు, పారిశుద్ధ్యం తదితరాలపైనా అర్జీలు నమోదైనట్లు తెలిపారు. అర్జీలకు సంబంధించి హాట్‌స్పాట్ పంచాయతీలను గుర్తించి.. అక్కడి పంచాయతీ కార్యదర్శులను అప్రమత్తం చేసినట్లు వెల్లడించారు. హౌసింగ్‌కు సంబంధించి ఇళ్ల స్థలాల పట్టాలు, ఇళ్ల మంజూరుకు సంబంధించి అర్జీలు వస్తున్నాయని.. అర్హత మేరకు ఈ అర్జీలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. జగనన్నకు చెబుదాం అర్జీల పరిష్కారంలో సంతృప్తి విషయంలో కాకినాడ జిల్లా మొదటి స్థానంలో ఉందని.. ఈ సంతృప్తి స్థాయిని మరింత పెంచేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. జేకేసీ కార్యక్రమంలో భాగంగానే ప్రజలకు మరింత చేరువయ్యేందుకు వీలుగా డయల్ యువర్ కలెక్టర్, డయల్ యువర్ ఎస్పీ, డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాలను ప్రతి వారం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రతి కార్యక్రమంలోనూ 20-30 అర్జీలు వస్తున్నాయని.. వారం రోజుల వ్యవధిలో 75 శాతం వరకు అర్జీలు పరిష్కారమవుతున్నట్లు కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. సమావేశంలో డిఐపిఆర్ఓ డి. నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

# కళ్లను చూడటం వల్ల కూడా ఐ ఫ్లూ వస్తుందా?



దేశవ్యాప్తంగా ఐ ఫ్లూ కేసులు వేగంగా పెరుగుతున్నాయి.ఈ రోజుల్లో రాజధాని ఢిల్లీతో సహా దేశంలోని అనేక ఇతర ప్రాంతాల్లో కండ్లకలక లేదా కంటి ఫ్లూ సమస్య వేగంగా పెరుగుతోంది. కళ్లలో నొప్పి, ఎరుపు, మంట, కుట్టడం వంటి ఫిర్యాదులతో పెద్ద సంఖ్యలో ప్రజలు ఆసుపత్రులకు వెళుతున్నారు. కంటి ఫ్లూ, కండ్లకలక లేదా పింక్ ఐ అని కూడా పిలుస్తారు, ఇది వర్షాకాలంలో ఎక్కువగా కనిపించే కంటి ఇన్ఫెక్షన్. అయితే గతంలో కంటే ఈసారి దాని కేసులు ఎక్కువగా తెరపైకి వస్తున్నాయి. అటువంటి పరిస్థితిలో, ఈ రోజు ఈ వ్యాసంలో, దానికి సంబంధించిన కొన్ని సాధారణ అపోహలు మరియు వాస్తవాలను తెలుసుకుందాం.

**అపోహ: కళ్లలోకి చూడటం వల్ల కండ్లకల వస్తుందా?**

**వాస్తవం:** కంటి ఫ్లూకి సంబంధించిన అత్యంత సాధారణ అపోహల్లో ఇది ఒకటి. సోకిన వ్యక్తి యొక్క కంటిలోకి చూడటం ద్వారా మీరు కండ్లకలక వస్తుందని మీరు తరచుగా వ్యక్తుల నుండి విని ఉంటారు. అయినప్పటికీ, ఇది పూర్తిగా తప్పు, ఎందుకంటే కండ్లకలక వ్యాధి సోకిన వ్యక్తి యొక్క కళ్ళ నుండి వచ్చే ద్రవంతో ప్రత్యక్ష సంబంధం ద్వారా మాత్రమే వ్యాపిస్తుంది.

**అపోహ- కండ్లకల చాలా అంటువ్యాధి.**

కండ్లకలక సమస్య అంటువ్యాధి మరియు వ్యాధి సోకిన వ్యక్తితో సన్నిహితంగా ఉండటం వలన అది వ్యాప్తి చెందే ప్రమాదాన్ని పెంచుతుందనడంలో సందేహం లేదు. కానీ ఇక్కడ గుర్తుంచుకోవలసిన విషయం ఏమిటంటే, అనేక రకాల ఐ ఫ్లూ అంటువ్యాధి కాదు. వైరల్ మరియు బ్యాక్టీరియల్ కండ్లకలక (స్టెఫిలోకాకల్ లేదా స్ట్రెప్టోకోకల్ బ్యాక్టీరియా వలన) చాలా అంటువ్యాధి. మరోవైపు, అలెర్జీ కాన్జూక్టివిటిస్ యొక్క అంటువ్యాధి అంత ఎక్కువగా ఉండదు.

**అపోహ- మీ కళ్ళు ఎర్రగా ఉంటే, అది కండ్లకల.**

కండ్లకలక పరిస్థితిలో కళ్ళు ఎర్రబడటం చాలా సాధారణం, కానీ ప్రతిసారీ కళ్ళు ఎర్రగా మారినప్పుడు, మీకు గులాబీ కళ్ల సమస్య వచ్చిందని అర్థం కాదు. అనేక ఇతర కంటి సమస్యలు ఉన్నాయి, దీని కారణంగా మీరు కళ్ళు ఎర్రబడవచ్చు. కంటి ఉపరితలంపై గాయం, స్క్రాచ్ లేదా గాయం లేదా ఒక విదేశీ వస్తువు కంటిలోకి రావడం వంటివి కూడా ఎరుపు మరియు నొప్పికి కారణమవుతాయి. దాని గుర్తింపు చాలా ముఖ్యం.

**అపోహ: మీరు మీ కళ్లను రుద్దకపోతే, మీకు కంటి ఫ్లూ రాదు.**

**వాస్తవం:** మురికి చేతులతో మీ కళ్లను తాకడం అనేది మీరు కండ్లకలక వ్యాధిని పొందేందుకు ఒక మార్గం. అటువంటి పరిస్థితిలో, మీరు మురికి చేతులతో మీ కళ్ళను తాకకపోయినా, ఇతర కారణాల వల్ల మీరు కంటి ఫ్లూ యొక్క పట్టులో చిక్కుకోవచ్చు. సరిగ్గా శుభ్రం చేయని కాంటాక్ట్ లెన్స్‌లు, మేకప్ లేదా కండ్లకలకతో కంటిపై ఉపయోగించిన ఐ-డ్రాప్ డిస్పెన్సర్ యొక్క కొన వంటి ఏదైనా కలుషితమైన వస్తువు లేదా పదార్థంతో పరిచయం ద్వారా కంటికి వ్యాధి సోకుతుంది.

**అపోహ- కండ్లకల అనేది పిల్లల్లో మాత్రమే వస్తుంది.**

చిన్న పిల్లల్లో మాత్రమే కండ్లకలక వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందనే అపోహ ప్రజల్లో ఉంది. అయితే ఇక్కడ గమనించాల్సిన విషయం ఏంటంటే ఈ సమస్య ఏ వయసు వారికైనా రావచ్చు. దీని సమస్య పెద్దవారిలో మరియు వృద్ధులలో కనిపిస్తుంది. ఇన్ఫెక్టివ్ కండ్లకలక సాధారణంగా చేతితో కంటికి పరిచయం చేయడం వల్ల వస్తుంది. అన్ని వయసుల వారు నివారణ చర్యలను కొనసాగించడం అవసరం.

**అపోహ: కండ్లకలకకు చికిత్స లేదా?**

**వాస్తవం:** ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, కండ్లకలక అనేది ఒక తేలికపాటి ఇన్ఫెక్షన్, అది దానంతట అదే మెరుగుపడుతుంది. అయినప్పటికీ, కంటి చుక్కల వంటి కొన్ని చికిత్సలు ఉన్నాయి, ఇవి అసౌకర్యం, పొడి మరియు మంటను తగ్గించగలవు. గులాబీ కన్ను దానంతటదే నయం అవుతుంది.

# జుట్టు రాలడానికి కారణమయ్యే మీ అలవాట్లను ఈరోజు నుండే మార్చుకోండి



అందమైన జుట్టు కావాలనే కోరికతో మనం తరచూ ఇలాంటి పనులు చేస్తుంటాం, జుట్టుకు మేలు చేసే బదులు, జుట్టు పాడవుతుంది. దెబ్బతిన్న జుట్టు చాలా సున్నితంగా ఉంటుంది కాబట్టి, అది విరిగిపోతుంది. జుట్టు పల్చబడటం అనేది సాధారణంగా స్త్రీలలో కనిపిస్తుంది కానీ పురుషులు జుట్టు రాలడం వల్ల బట్టతల వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

ఈ సమస్యను తీవ్రంగా పరిగణించడం ముఖ్యం. జుట్టు రాలడానికి కారణమయ్యే కొన్ని రోజువారీ అలవాట్ల గురించి ఇక్కడ మేము మీకు చెప్పబోతున్నాం.

**తలకు షాంపూ పెట్టడం లేదు**

చాలా మంది జుట్టును షాంపూతో తలస్నానం చేసినప్పుడు, జుట్టు పొడవుకు మాత్రమే షాంపూ వేస్తారు. కానీ గుర్తుంచుకోండి, జుట్టు యొక్క అంతర్గత శుభ్రపరచడం బాహ్యమైనదిగా ముఖ్యమైనది. వాస్తవానికి, మీ తలపై చిన్న వెంట్రుకల కుదుళ్లు ఉన్నాయి, వాటి కింద నూనెను తీసుకువచ్చే సేబాషియస్ గ్రంథులు ఉన్నాయి. ఈ నూనెను సెబమ్ అంటారు. మీ స్కాల్ప్ మరియు జుట్టు ఆరోగ్యంగా ఉంచుకోవడానికి ఇది అవసరం. కానీ వాటిని క్రమం తప్పకుండా శుభ్రం చేయకపోతే జుట్టులో మురికి పేరుకుపోతుంది. ఇది ముందుకు వెళ్లి చుండ్రు మరియు దురదకు కారణమవుతుంది.

**జుట్టు కడిగిన తర్వాత కండీషనర్‌ను దాటవేయడం**

సన్నని మరియు గిరజాల జుట్టు త్వరగా చిక్కుకుపోతుంది మరియు వాటిని విడదీయడం ద్వారా నాట్లు ఏర్పడతాయి. ఈ ప్రక్రియలో చాలా జుట్టు రాలిపోతుంది. అటువంటి పరిస్థితిలో, జుట్టును కడిగిన తర్వాత కండీషనర్ చేయడం అవసరం. దీంతో జుట్టు సిల్కీగా, మృదువుగా మారుతుంది. మరియు వాటిని పరిష్కరించడానికి ఎక్కువ శ్రమ అవసరం లేదు.

**జుట్టు బ్రష్**

ఒక పదునైన చేతితో తడి జుట్టు మీద టవల్ ఉపయోగించడం వల్ల మీ జుట్టు చాలా బలహీనంగా మారుతుంది మరియు దీని కారణంగా జుట్టు రాలవచ్చు. బదులుగా, రుద్దడం మరియు తుడవడం ద్వారా, జుట్టు యొక్క పై పొరను క్యూటికల్ అని పిలుస్తారు, ఇది గరుకుగా మారుతుంది. దీని కారణంగా, జుట్టు పొడిగా మారుతుంది మరియు విరిగిపోతుంది. అందుకే జుట్టు కడుక్కున్నప్పుడల్లా రుద్దుతూ టవల్ ఉపయోగించకండి. అయితే వాటిని సహజ గాలిలో ఆరనివ్వండి.

**తడి జుట్టు తుడవడం**

తడి వెంట్రుకలను దువ్వడం వల్ల జుట్టు బలహీనంగా మారుతుంది మరియు సులభంగా విరిగిపోతుంది. దీనితో పాటు, జుట్టు వంకరగా ఉంటే సమస్య మరింత పెరుగుతుంది. దీని వల్ల జుట్టు విపరీతంగా విరిగిపోతుంది మరియు చాలా ఉబ్బినట్లుగా మారుతుంది. అందుకే మీ జుట్టును కడిగిన తర్వాత లేదా ఎక్కువ చెమట పట్టిన తర్వాత ఎప్పుడూ దువ్వకండి. అలా కాకుండా, జుట్టును బాగా ఆరిన తర్వాత మాత్రమే దువ్వండి.

**వెచ్చని నీటితో జుట్టు కడగడం**

వేడి నీటిని నిరంతరం వాడటం వల్ల తల పొడిబారడం వల్ల దురద మరియు చుండ్రు వస్తుంది. ఎందుకంటే వేడి నీరు హైడ్రోజన్ బంధాలను విచ్ఛిన్నం చేస్తుంది, దీని వలన జుట్టు 18% వరకు ఉబ్బుతుంది. అందుకే, మీరు కూడా మీ జుట్టును వేడి నీళ్లతో కడుక్కుంటే, ఈరోజు నుంచే ఈ అలవాటును మార్చుకోండి.

**హెయిర్ డ్రైయర్ మరియు స్ట్రెయిట్‌నర్‌లను ఎక్కువగా ఉపయోగించడం**

హెయిర్ డ్రైయర్ మరియు స్ట్రెయిట్‌నర్‌లను ఎక్కువగా ఉపయోగించడం వల్ల మీ జుట్టు సహజ సౌందర్యాన్ని దూరం చేస్తుంది మరియు వాటిని గరుకుగా మార్చుతుంది. ఎందుకంటే, వాటి నుండి వెలువడే వేడి మీ జుట్టు యొక్క మూలాలను దెబ్బతీస్తుంది మరియు జుట్టు చివర్లను కూడా చీల్చేలా చేస్తుంది. అందుకే కనీసం వీటిని వాడండి.

# మందులు వేసుకోకుండానే మధుమేహాన్ని ఎలా తగ్గించుకోవాలి



మధుమేహాన్ని అదుపులో ఉంచుకుంటే తప్ప పూర్తిగా అది నయం కాదు. కానీ ఇన్సులిన్ లేదా మందుల అవసరం లేకుండా కూడా మధుమేహాన్ని తరిమికొట్టవచ్చు. మందులు లేకుండా మధుమేహాన్ని నియంత్రించాలనుకుంటే జీవనశైలిలో 5 మార్పులు చేసుకుంటే చాలు.

**ఆరోగ్యకరమైన ఆహారం**

మధుమేహ వ్యాధిగ్రస్తులు చేయాల్సిన పని ముందుగా ఆహారంలో మార్పులు చేసుకోవడం. కొందరు వ్యక్తులు తమ ఆహారాన్ని మార్చుకోవాలని చెబితే పెద్దగా మార్పులు చేయరు. రుచికరమైన ఆహారాన్ని తినలేమని అనుకుంటారు. మీరు ఆరోగ్యకరమైన జీవనస్తైలిని అభివృద్ధి చేసుకోవడానికి ముందుకు చేయాల్సిన పని ఆహారాన్ని ఎంచుకోవడం. రక్తంలో చక్కెరను పెంచే ఆహారాలు తినకూడదు. అలాగే ఫైబర్ ఎక్కువగా ఉన్న ఆహారాలను తీసుకోవాలి. కూరగాయలు తినాలి. తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ఆహారాలు తినడం మంచిది. అలాగే ఆహారాన్ని మితంగా తినాలి.

**రోజూ వ్యాయామం చేయాలి**

రక్తంలో చక్కెరను అదుపు చేయడంలో వ్యాయామం కీలక పాత్ర పోషిస్తుంది. వ్యాయామం ఇన్సులిన్ ఉత్పత్తికి సహాయపడుతుంది. వారానికి 150 నిమిషాల పాటు రోజుకు 30 నిమిషాలు వ్యాయామం చేయాలి. వ్యాయామం చేయడం వల్ల మధుమేహం అదుపులో ఉండటమే కాకుండా బరువును కూడా నియంత్రించవచ్చు.

**ఆరోగ్యకరమైన శరీర బరువు**

అధిక బరువుతో ఉన్న వారు క్రమంగా బరువు తగ్గడంపై దృష్టి పెట్టాలి. దీని వల్ల శరీరంలో చక్కెర స్థాయిలు తగ్గడానికి సహాయపడుతుంది. ఆహారం, వ్యాయామం వల్ల బరువు తగ్గవచ్చు.

**మానసిక ఒత్తిడిని నియంత్రించుకోవాలి**

మానసిక ఒత్తిడిని అదుపులో ఉంచుకోవాలి. మానసిక ఒత్తిడి పెరిగితే మధుమేహం మాత్రమే కాకుండా అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి. కాబట్టి మానసిక ఒత్తిడిని అదుపులో ఉంచుకోవాలి. రోజూ కంటినిండా నిద్రపోవాలి. వృత్తి జీవితం, వ్యక్తిగత జీవితం మధ్య సమతుల్యతను కాపాడుకోవాలి. ధ్యానం, యోగా సాధన చేయడం వల్ల మానసిక ఒత్తిడిని నియంత్రించుకోవచ్చు.

**నీళ్లు బాగా తాగాలి**

నీరు పుష్కలంగా తాగాలి. రోజుకు 8 గ్లాసుల నీరు తాగడం అలవాటు చేసుకోవాలి. దాహం వేయకపోయినా కొద్దిగా అయినా తాగుతూ ఉండాలి. దీని వల్ల కిడ్నీలు బాగా పని చేయడంతోపాటు రక్తంలో చక్కెర నియంత్రణకు సహాయపడుతుంది.

# కొబ్బరినూనెని జుట్టుకే కాదు చర్మ సౌందర్యానికి కూడా ఉపయోగించుకోవచ్చు!



కొబ్బరితో ఎన్నో ఆరోగ్యకరమైన ప్రయోజనాలు ఉన్నాయి. రోజూ కొబ్బరి తినడం వల్ల శరీరానికి చాలా బెనిఫిట్స్ ఉన్నాయి. అలాగే కొబ్బరి నూనెని కేవలం జుట్టుకు మాత్రమే కాకుండా ముఖానికి రాయడం వల్ల కూడా అనేక ప్రయోజనాలు ఉన్నాయని మీకు తెలుసా. రాత్రి పడుకునే ముందు ముఖానికి కొబ్బరి నూనె రాయడం వల్ల వివిధ రకాల చర్మ సమస్యలకు చెక్ పెట్టవచ్చు. కొబ్బరినూనెలో యాంటీ ఇన్ ఫ్లమేటరీ లినోలిక్ యాసిడ్, విటమిన్ ఎఫ్, యాంటీ బాక్టీరియల్ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి మీ చర్మానికి సహజ మాయిశ్చరైజర్ గా పని చేసి, చర్మాన్ని కాంతివంతంగా చేస్తుంది.

కొబ్బరి నూనెను పొడి, సాధారణ చర్మం ఉన్న వాళ్లు మాత్రమే ఉపయోగించాలి. జిడ్డులాగా చర్మం ఉన్న వాళ్లు ఈ నూనెను ఎట్టి పరిస్థితుల్లోనూ ముఖానికి రాయకూడదు. కొబ్బరి నూనెతో ముఖ సౌందర్యం రెట్టింపు అవుతుంది. రోజూ రెండు చుక్కల కొబ్బరి నూనె ముఖం, మెడకి రాయడం వల్ల స్కిన్ హైడ్రేట్ గా ఉంటుంది కొబ్బరి నూనెను చర్మంపై ఉపయోగించే ముందు కొన్ని విషయాలను గుర్తించుకోవాలి. ఎల్లప్పుడూ వర్జిన్ కొబ్బరి నూనెను మాత్రమే ఉపయోగించుకోవాలి. అలాగే కొబ్బరి అంటే అలర్జీ ఉన్నవారికి కొబ్బరి నూనెతో కూడా అలర్జీ రావచ్చు. సున్నితమైన చర్మ ఉన్న వారు కూడా కొబ్బరి నూనెను ఉపయోగించడం హానికరం కొబ్బరి నూనెను రోజూ ముఖానికి రాయడం వల్ల నల్లమచ్చలకు చెక్ పెట్టవచ్చు. రోజూ కొబ్బరినూనె రాయడం వల్ల చర్మం టోన్ తెలికపడుతుంది. కొబ్బరి నూనె రోజూ రాసుకోవడం వల్ల చర్మం నల్లగా అవుతుందని, కొందరు అంటూంటారు కానీ ఇది కేవలం అపోహ మాత్రమే.

# రాత్రి వేళ డిన్నర్ ఎందుకు మానకూడదు



ప్రపంచంలో ఏ మూలన ఎక్కడున్నా ప్రతి ఒక్కరి ఆహరపు అలవాటు ఒక్కటే. ఉదయం బ్రేక్‌ఫాస్ట్ మద్యాహ్నం, రాత్రి భోజనం. తినే ఆహారంలో తేడా ఉంటుందేమే గానీ రోజుకు మూడు పూట్ల తినడం ప్రపంచమంతా ఒకటే అలవాటు. జీవనచక్రం ఆలా ఉంటుంది అందుకే ఈ అలవాటు. ఈ జీవనచక్రం గతి తప్పితేనే వివిధ రకాల సమస్యలు ఉత్పన్నమౌతుంటాయి.

ఆధునిక జీవితంలో ఎంత బిజీగా ఉన్నా ఉదయం, మద్యాహ్నం, రాత్రి తప్పకుండా తినాల్సిందే. శరీరానికి అవసరమైన పోషకాలు ఎప్పటికప్పుడు అందించేందుకు ఈ ప్రక్రియ దోహదపడుతుంది. తినే ఆహారంలో తేడా ఉన్నా..సమయానికి మాత్రం తప్పకుండా తినాల్సిందే. కొంతమంది డైటింగ్ పేరు చెప్పో లేదా మరే ఇతర కారణంతోనే రాత్రి డిన్నర్ మానేస్తుంటారు. ఇది ఆరోగ్యానికి ఏ మాత్రం మంచిది కాదు. దీనివల్ల ప్రతికూల పరిణామాలుంటాయి. పనిలో పడి లేదా పనితో అలసిపోయి రాత్రి భోజనం చేయకుండా అలానే పడుకుండిపోతుంటారు. ఇంకొందరైతే రాత్రి వేళ భోజనం మానేసి డైటింగ్ చేస్తే బరువు తగ్గుతామనే ఆలోచనలో ఉంటారు. ఇది పూర్తిగా తప్పు. మంచి అలవాటు కానే కాదు. ఇలా చేయడం వల్ల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుంది. రాత్రి డిన్నర్ స్కిప్ చేస్తే కలిగి దుష్పరిణామాల గురించి తెలుసుకుందాం.

కారణం ఏదైనా సరే రాత్రి వేళ డిన్నర్ స్కిప్ చేయడం ఆరోగ్యానికి మంచిది కాదు. ముఖ్యంగా రాత్రి పూట ఏం తినకుండా పడుకుంటే అర్ధరాత్రి సమయంలో ఆకలి మొదలౌతుంది. దాంతో రోజుకు కావల్సిన 7-8 గంటల ప్రశాంత నిద్ర కరువౌతుంది. ఫలితంగా మరుసటి రోజు తీవ్రమైన అలసట, నీరసం ఆవహిస్తాయి. అందుకే డిన్నర్ వదలడం మంచిది కాదు. రాత్రి డిన్నర్ స్కిప్ చేస్తే బరువు తగ్గిపోతామని భావించడం సరైంది కాదంటున్నారు ఆరోగ్య నిపుణులు. బరువు తగ్గే విషయం పక్కనబెడితే శరీరంలో అవసరమైన పోషకాలు ఎప్పటికప్పుడు అందకుండా ఉంటాయి. పోషకాల లోపం కూడా ఏర్పడవచ్చు. దీంతోపాటు ఎసిడిటీ, గ్యాస్ వంటి సమస్యలు ఉత్పన్నం కావచ్చు. శరీరం పనితీరుపై ప్రభావం పడుతుంది. రోజూ అదే పనిగా డిన్నర్ మానేయడం వల్ల చాలా రకాల అనారోగ్య సమస్యలు ఎదురౌతాయి. ఒక్కోసారి సమయం లేదనే కారణంతో వంట వండలేక రాత్రి పూట డిన్నర్ మానేస్తుంటారు. రాత్రి భోజనం అనేది చాలా అవసరం. ఇది లేకపోతే వివిధ రకాల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. ముఖ్యంగా శరీరానికి కావల్సిన ఎనర్జీ లభించదు. అందుకే ఒక్కపూట రాత్రి భోజనం మానేసినా ఆ ప్రభావం మరుసటి రోజు తప్పకుండా పడుతుంది.

# కలబందతో అందమే కాదు ఆరోగ్యం కూడా



కలబందలో ఎన్నో రకాల ఔషధ గుణాలు ఉన్నాయి. ఈ కారణంగానే అనేక కాస్మటిక్స్ తయారీలో కలబందను వాడతారు. ఇంకా చాలా మంది హెూమ్ రెమెడీ రూపంలో కూడా కలబందను తీసుకుంటారు. అయితే కలబంద కేవలం అందానికే కాక ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. మన శరీరానికి కావాలసిన పోషకాలు కూడా ఇందులో ఉన్నాయి.

విటమిన్లు: కలబందలో విటమిన్ ఎ, సి, ఇ.. కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం వంటి అనేక మినరల్స్ ఉన్నాయి. ఇంకా కలబందలో యాంటీఆక్సిడెంట్లు కూడా ఉన్నాయి. ఇవి శరీర ఆరోగ్యం స్థిరంగా ఉండడానికి ఉపయోగపడతాయి.

జీర్ణక్రియ: కలబందలోని ఎంజైములు పోషకాల శోషణ ప్రక్రియను మెరుగు పరచడంలో ఉపయోగకరంగా ఉంటాయి. ఇంకా ఇందులోని ఇన్ఫ్లమేటరీ లక్షణాలు మలబద్ధకం, అజీర్తి వంటి సమస్యలను తగ్గిస్తాయి.

రోగనిరోధక శక్తి: కలబందలోని విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు రోగనిరోధక శక్తిని పెంచి సీజనల్ వ్యాధుల నుంచి రక్షణ కల్పించడంతో సహాయపడతాయి.

బరువు తగ్గడం: ముందుగా చెప్పు కున్నట్లు కలబంద జీర్ణవ్యవస్థ పనితీరు ను మెరుగుపరుస్తుంది. ఇది పరోక్షంగా బరువు తగ్గేలా ప్రభావితం చేస్తుంది.

ఎముకల దృఢత్వం: కలబందలోని కాల్షియం ఎముకల పటిష్టతకు చాలా అవసరమైన పోషకం. ఇది మీ ఎముకలను బలోపేతం చేస్తుంది.

# ఈజీగా వంటింటి చిట్కాలు

వంటగదిలో ఆడవారికి పని త్వరగా అవ్వాలంటే కొన్ని కిటుకులు పాటించాల్సిందే. లేకపోతే కిచెన్ లో పనులు అంత సులభంగా అవ్వవు. ముఖ్యంగా సీజన్ల బట్టి ఆయా జాగ్రత్తలు తీసుకుంటూ ఉండాలి. అలాగే వంటలు టేస్టీగా రావాలన్నా కూడా చిట్కాలు పాటించాల్సిందే.

**మీకోసం మరిన్ని చిట్కాలు:**

వంటగదిలో బంగాళా దుంపలు, ఉల్లిపాయలు ఒకే దగ్గర స్టోర్ చేస్తే అవి త్వరగా పాడయ్యే ఛాన్స్ ఉంది. ఈ రెండింటిని ఒకే దగ్గర స్టోర్ చేస్తే వాయువులను రిలీజ్ చేస్తాయి. దీనివల్ల త్వరగా పాడయ్యే అవకాశాలు ఉన్నాయి. అలా కాకుండా ఉండాలంటే విడివిడిగా స్టోర్ చేయాలి.



వర్షాకాలం, వింటర్ సీజన్ లలో మసాలా పదార్థాల్లో తేమ వస్తుంటుంది. దీంతో అచ్చులు ఏర్పడతాయి. ఇలా కాకుండా ఉండాలంటే మసాలా డబ్బాల్లో కాస్త రాళ్ల ఉప్పు వేయాలి. ఇలా చేస్తే సోడియం క్లోరైడ్ తేమని గ్రహిస్తుంది. దీని వల్ల మసాలా పదార్థాలు తడవకుండా ఉంటాయి.

పచ్చిమిరపకాయల్ని కాసింత పసుపుతో చేర్చి డబ్బాల్లో కానీ సీసాల్లో కానీ నిలవ చేస్తే ఎరుపు రంగు మారకుండా ఉంటాయి.

ఉప్పు జాడీలో రెండు పచ్చిమిరపకాయలు వేస్తే.. వర్షాకాలంలో ఉప్పు చెమ్మచేరి నీరు కారిపోకుండా ఉంటుంది.

పెరుగు పుల్లగా అవ్వకుండా ఉండాలంటే.. పెరుగులో కొబ్బరి ముక్కను వేసి చూడండి.

వెల్లుల్లి రేకులను సులువుగా తీయాలంటే వాటిని ఎండలో కొద్దిసేపు ఉంచండి.

దోసెల పిండిలో ఒక కప్పు సగ్గుబియ్యం కూడా వేసి రుబ్బితే, దోసెలు చిరగకుండా పల్చగా వస్తాయి.

కోడిగుడ్లు ఉడికించే నీళ్ళలో కాస్త ఉప్పు వేసినా, ఉడికించిన వెంటనే గుడ్లను చన్నీళ్లలో వేసినా పెంకు సులభంగా వస్తుంది.

అలాగే నిమ్మరసం ఎక్కువగా రావాలంటే ముందుగా 20 సెకన్ల పాటు మైక్రోవేవ్ లో ఉంచండి. ఇది నిమ్మకాయని మృదువుగా చేస్తుంది. దీంతో రసం బాగా వస్తుంది.

## ఇన్స్యూరెన్స్ పాలసీ తీసుకోవడం లాభమా? నష్టమా?

1. ఇన్స్యూరెన్స్ పాలసీలు ఎన్ని రకాలు ?

జ:

1. జనరల్ ఇన్స్యూరెన్స్.
(స్థిర-చర ఆస్తులకు సంబంధించినది.)
2. హెల్త్ ఇన్స్యూరెన్స్.
3. లైఫ్ ఇన్స్యూరెన్స్.

1. ఇన్స్యూరెన్సు పాలసీని ఆర్థికంగా ఒకరక్షణ కవచంగా చూడాలే తప్ప ఆదాయ వనరుగా చూడకూడదు.
2. మొదటి ప్రాధాన్యతగా కుటుంబం మొత్తానికి కనీసం 5లక్షలకైనా తగ్గకుండా హెల్త్ ఇన్స్యూరెన్స్ పాలసీ తీసుకోవాలి.
3. టెర్మ్ ఇన్స్యూరెన్స్ పాలసీనే నిజమైన ఇన్సూరెన్స్ గా గుర్తించాలి.
4. ఏ ఇన్సూరెన్స్ కంపెనీ నుండైనా టెర్మ్ ఇన్సూరెన్స్ పాలసీని పొందాలంటే ఇన్‌కమ్ ట్యాక్స్ చెల్లింపుదారుగా ఉన్నవారికే అది సాధ్యం.
5. మీరు 5లక్షల ఆదాయాన్ని చూపిస్తూ ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్న్ ఫైల్ చేస్తే మీరుచెల్లించే ఆదాయపు పన్ను 5వేలకు కూడా మించదు.
6. ఫలితంగా కోటిరూపాయల టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీని పొందడానికి మీరు అర్హులవుతారు.
7. వరుసగా 3సంవత్సరాలు ఐటి రిటర్న్స్ దాఖలు చేస్తేనే టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీకి అర్హులవుతారు.
8. టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీలకు చాలా తక్కువ ప్రీమియం ఉంటుంది. ఇన్సూరెన్స్ కంపెనీలు ఏజెంట్స్ కి చెల్లించే కమీషన్ చాలా అంటే చాలా కొంచెం.
9. అసలు ఇన్సూరెన్స్ కంపెనీల మౌలిక సూత్రమే "టర్మ్ ఇన్సూరెన్స్".
10. కానీ మన భారతదేశంలోని ప్రజలు ఇన్సూరెన్స్ పాలసీని తీసుకోవడం వల్ల లాభమెంత? అనే కోణంలో ఆలోచిస్తూ ఉండడంవల్ల కంపెనీలు ఎండోమెంట్ & యూనిట్ లింక్డ్ ప్లాన్ లను రూపొందించడం మొదలుపెట్టాయి.
11. అసలు రహస్యం ఏంటంటే ఏ ఇన్సూరెన్స్ కంపెనీ అయినా ఎండోమెంట్ ప్లాన్లమీద 5%కి మించి కస్టమర్లకి లాభాన్ని చేకూర్చడానికి ఏమాత్రం ఇష్టపడవు.
12. ఫలితంగా ఇన్సూరెన్స్ చేసినవాళ్ళు మెచ్యూరిటీ అమౌంట్ చేతికొచ్చిన రోజు ఆకొద్ది డబ్బును చూసి, "ఏజెంట్లు చెప్పినవన్నీ అబద్ధాలు... ఇన్సూరెన్స్ అంటేనే మోసం" అని నిందిస్తూ ఉంటారు.
13. హెల్త్ ఇన్సూరెన్స్, టర్మ్ ఇన్సూరెన్స్ ఈ రెండేతప్ప మరే ఇతర ఇన్సూరెన్స్ ల జోలికీ వెళ్లకూడదు.
14. ఎందుకంటే మన విలువైన కాలంలో సంపాదించే అపురూపమైన ధనాన్ని వృధా చేసుకోకూడదు కాబట్టి.
15. ఆర్థిక వృద్ధికి మంచి ప్లాన్ మరోసారి చెప్తాను.
16. ఎందుకు ఇంతగా చెప్తున్నానంటే... ఈరోజు మాషాపుకు ఒక ఎల్ఐసీ ఏజెంట్ & వారి డెవలప్‌మెంట్ ఆఫీసర్ వచ్చారు. ఓపాలసీని నాముందు ఉంచి ఎంతో గొప్పగా ప్రెజెంట్ చేశారు.
17. నేను ఒకప్పటి మాజీ ఎల్ఐసీ ఏజెంట్ ను కావడంవల్ల వారు చెప్పినవన్నీ విని నవ్వుకొన్నాను.
18. మీకు ఓమంచి సలహా ఇవ్వదలచి ఇదంతా చెబుతున్నాను.

## పకడ్బందీగా డిపార్ట్‌మెంటల్ పరీక్షలు



**విజయనగరం:** ఈ నెల 2 నుంచి ప్రారంభం కానున్న డిపార్ట్‌మెంటల్ పరీక్షల నిర్వహణకు పకడ్బంధీగా ఏర్పాట్లు చేయాలని, వివిధ శాఖల అధికారులను జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై తన ఛాంబర్‌లో మంగళవారం వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ, అన్ని శాఖలు సమన్వయంతో వ్యవహరించి, పరీక్షలను విజయవంతంగా నిర్వహించాలని, అభ్యర్థులకు ఎటువంటి లోటుపాట్లు రాకుండా చూడాలని కోరారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని, తగిన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయాలని, త్రాగునీటిని అందుబాటులో ఉంచాలని, ప్రాథమిక చికిత్సా కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయాలని సూచించారు.

ఎపిపిఎస్‌సి సెక్షన్ ఆఫీసర్ పి.ఢిల్లీశ్వరరావు మాట్లాడుతూ, పరీక్షల నిర్వహణ విధివిధానాలను వివరించారు. ఈ పరీక్షలు ఎపిపిఎస్‌సి ఆధ్వర్యంలో ఈనెల 2 వ తేదీ నుంచి 7వ తేదీ వరకు ఆరు రోజులపాటు, స్థానిక సీతం కళాశాలలో జరుగుతాయని చెప్పారు. ఆబ్జెక్టివ్ పరీక్ష ఉదయం 10 గంటలు నుంచి 12 వరకు, మధ్యాహ్నం 3 నుంచి 5 వరకు జరుగుతుందని, డిస్క్రిప్టివ్ పరీక్ష పరీక్ష ఉదయం 10 నుంచి 1 గంట వరకు, మధ్యాహ్నం 3 నుంచి 6 గంటలు వరకు జరుగుతుందని తెలిపారు. విభిన్న ప్రతిభావంతులు పరిక్ష రాసేందుకు ఆబ్జెక్టివ్ పరీక్షకు అదనంగా 40 నిమిషాలు, డిస్క్రిప్టివ్ పరీక్షకు 50 నిమిషాలు ఇవ్వాలని, స్క్రయిబ్‌లను అనుమతించాలని చెప్పారు. వీలైనంత వరకు గర్భిణులను క్రింద అంతస్తులోనే పరీక్ష రాయించాలని సూచించారు. పరీక్ష నిర్వహించిన తరువాత, జవాబు పత్రాల ప్యాకింగ్‌లో తగిన జాగ్రత్తలను తీసుకోవాలని కోరారు.

ఈ సమావేశంలో కలెక్టరేట్ సూపరింటిండెంట్ దేవ్ ప్రసాద్, సిఐ గోపాలనాయుడు, ఎలక్ట్రికల్ డిఇ ధర్మరాజు, ఎపిపిఎస్‌సి అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ జె.చంద్రరావు, వివిధ శాఖల ప్రతినిధులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# పరవాడలో గెడ్డ వాగు ఆక్రమణ

## రెవిన్యూ అధికారులు మౌనం



**పరవాడ, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి జిల్లా మండల కేంద్రమైన పరవాడలో సర్వే నెంబర్ 304 గెడ్డ వాగు ఆక్రమణపై రోజు రోజుకీ నాటకీయ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఒక పక్క రియల్ వ్యాపారులు గెడ్డ వాగు కబ్జాకు అన్ని అస్త్రాలు ప్రయోగిస్తున్నారు. మరో పక్క రియల్ బారి నుంచి గెడ్డ వాగును కాపాడాలని స్థానికులు రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం గెడ్డ వాగును పూడ్చి పైపులు వేస్తుండగా వీఆర్వో వెళ్లి పనులను ఆపించేసారు. కానీ గెడ్డ వాగులోని ఆక్రమణలను మాత్రం తొలగించలేదు. దీంతో రెవెన్యూ అధికారులు రియల్ వ్యాపారులకు కబ్జా చేసి రోడ్డు వేసుకునే అవకాశం కల్పించినట్లు అయింది. ఈ క్రమంలో ఈ రోజో లేక రేపో రాత్రి వేళ రోడ్డు పనులు పూర్తి చేసుకునేందుకు ఆ రియల్ వ్యాపారులు సిద్ధం చేసుకున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోకుండా మౌనం వహిస్తూ సమాధానం దాట వేస్తున్నారు. పైగా ఇందులో అదికార పార్టీ పెద్దలు ప్రమేయం ఉందని, అందువలన ఎలాంటి చర్యలు తీసుకోలేక పోతున్నామని అధికారులే సదరు కార్యాలయం సిబ్బందితో వాపోతున్నట్లు గుస గుసలు కూడా ఉన్నాయి.

# ఎపి మధ్యాహ్నభోజన పథకం యూనియన్ 4వ మహాసభ




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఎపి మధ్యాహ్నభోజన పథకం కార్మికుల యూనియన్ 4వ జిల్లా మహాసభ మంగళవారం జగదాంబ వద్దగల సిఐటియు ఆఫీస్ నందు ఘనంగా జరిగింది. ఈ మహాసభకు ముఖ్య అతిధిగా ఆంధ్రప్రదేశ్ మధ్యాహ్నభోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయా రమాదేవి హాజరయ్యారు. ఈ సందర్భంగా తను మాట్లాడుతూ మధ్యాహ్నభోజన పథకం కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా 80వేల మంది ఉన్నారని విశాఖలో 900మంది ఉన్నారని వీరి సమస్యలను పరిష్కరించటంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. గత 20సం?రాల నుండి మధ్యాహ్నభోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులుగా గుర్తించి కనీస వేతనాలు ఇవ్వాలని, 12నెలలకు వేతనాలు చెల్లించాలని, మార్కెట్‌లో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు 20/%--%రూ?లకు పెంచాలని, ఈ పథకానికి బడ్జెట్ కేటాయింపు పెంచాలని, ప్రమాదభీమా కల్పించాలని, గ్యాస్, వంటపాత్రలు ప్రభుత్వమే సరఫరా చేయాలని, ఈ పథకాన్ని ప్రైవేటు, స్వచ్ఛంధ సంస్థలకు అప్పజెప్పవద్దని కోరారు. సం?రానికి 2జతల యూనిఫారం సరఫరా చేయాలని, మౌలిక వసతులు కల్పించాలని కోరారు. రాగి జావ తయారు చేయడానికి అవసరమ్యే వంటపాత్రలు, గ్యాస్, స్టవ్‌లు ప్రభుత్వమే సమకూర్చాలని, విద్యార్థులకు సంఖ్య అనుగుణంగా వర్కర్స్‌ని పెంచాలని డిమాండ్ చేసారు.

ఈ సమస్యల పరిష్కరం కోసం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని, లేనియెడల "సెప్టెంబర్-8 విజయవాడలో మహాధర్నా" నిర్వహిస్తామని ఈ ధర్నాకు మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులందరూ హాజరు కావాలని కోరారు. ఈ మహాసభలో సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్, శ్రామిక మహిళ కన్వీనర్ పి.మణి తదితరులు ప్రసంగించారు.

ఈ మహాసభకు రాము, భవానీ, రాంభాయి, మంగశ్రీ, అధ్యక్ష వర్గంగా వ్యహరించారు.ఈ మహాసభలో మధ్యాహ్నభోజన పథకం కార్మికులకు రిట్మైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, హైస్కూల్‌లో పనిచేస్తున్నవారికి వేతనం ఇవ్వాలని, బడ్జెట్‌లో నిధులు పెంచాలని తీర్మానాలు చేసారు. అనంతరం నూతన జిల్లా కమిటీ 31 మందితో ఎన్నుకోవడం జరిగింది.

విశాఖ జిల్లా అధ్యక్షురాలుగా ఎన్.సీతాభావనీ, ప్రధాన కార్యదర్శిగా జి.మంగశ్రీ, కోశాధికారిగా కె.కళాచందనలతో పాటు ఉపాధ్యక్షులు, కార్యదర్శులుగా డి.వరలక్ష్మి, ఎస్.పి.కాళి, ఎస్.నిర్మల, పార్వతీ, రత్నం, రాము, ఈశ్వరమ్మ, కొండమ్మ, రాజు తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

# గిరిజనుల సంక్షేమానికి హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యం



**విజయనగరం:** రాష్ట్రంలోని గిరిజనుల సంక్షేమానికి, హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యం కల్పిస్తూ తన కర్తవ్యాన్ని, బాధ్యతలను నిర్వర్తిస్తానని.. రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుతూ వారిలో చైతన్యం నింపుతానని రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డా. డీవీజీ శంకరరావు అన్నారు. దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ.. గిరిజన ప్రజలను నాగరికతకు, అభివృద్ధికి మరింత చేరువ చేసేందుకు కమిషన్ తరపున తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలి సారిగా మంగళవారం ఆయన స్థానిక జిల్లా పరిషత్ అతిథి గృహంలో విలేకరులతో సమావేశం అయ్యారు. గిరిజన ప్రజల దీర్ఘకాలిక సమస్యలు, హక్కులు పరిరక్షణ, చట్టాల పర్యవేక్షణ, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై మాట్లాడారు. కమిషన్ తరపున రాష్ట్రంలోని అన్ని గిరిజన ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటిస్తామని, వారి హక్కులు, చట్టాల అమలుపై వారిలో చైతన్యం నింపుతామని ఉద్ఘాటించారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల సంక్షేమానికి ఇప్పటికే పలు పథకాలను అమలు చేస్తోందని గుర్తు చేశారు. వారి అభ్యున్నతికి, ఉన్నత లక్ష్యాల సాధనకు కమిషన్ ఎప్పుడూ అండగా నిలుస్తుందని ఛైర్మన్ పేర్కొన్నారు.

ప్రభుత్వ పాలసీ విధానాల రూపకల్పనలో భాగస్వామ్యం అవుతూ, నిష్పక్షపాత సేవలు అందించేందుకు కమిషన్ ప్రధాన పాత్ర పోషిస్తుందని అన్నారు. ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ గిరిజనుల సమస్యలపై ప్రభుత్వానికి నివేదిస్తామని, పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. చట్టాల ఉల్లంఘనలు జరగకుండా పూర్తి స్థాయిలో బాధ్యతగా వ్యవహరిస్తూ గిరిజన ప్రజలకు అన్ని విధాలా అండగా నిలుస్తామన్నారు.

అన్ని విభాగాలు, ముఖ్యంగా మీడియా సహకారం తీసుకొని గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన శిబిరాలు నిర్వహిస్తామని, గిరిజన చట్టాలు, హక్కులు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తామని ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డా. డీవీజీ శంకరరావు పేర్కొన్నారు. ఎస్టీ కుల ధృవీకరణ పత్రాల జారీ, డోలీ కష్టాలు, బోయ కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చుట, విజయనగరం జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటు, గిరిజన ప్రాంతాల్లో రోడ్ల సదుపాయాలపై విలేకరులు ప్రశ్నలు అడగ్గా క్షేత్ర స్థాయి పర్యటనలు చేసి పరిశీలించి పూర్తి స్థాయి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని బదులిచ్చారు.

# నేరస్తులకు హారతి పట్టాలా ? యోగీ ఆదిత్యనాథ్



ఉత్తర్ ప్రదేశ్ లో ఆరేళ్ల క్రితం తొలిసారి అధికారం చేపట్టిన తర్వాత శాంతి భద్రతలపై పూర్తిగా దృష్టిపెట్టిన సీఎం యోగీ ఆదిత్యనాథ్.. అప్పటి నుంచి నేరస్తుల భరతం పడుతున్నారు. ముఖ్యంగా భారీ ఎత్తున ఎన్ కౌంటర్లతో నేరస్తులను బెంబేలెత్తిస్తున్న యోగీ ఆదిత్యనాథ్.. పలు సందర్భాల్లో వారి ఇళ్లను కూడా బుల్ డోజర్లను పంపి కూల్చేస్తున్నారు. ఈ చర్యలపై విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో యోగీ తాజాగా దీనిపై వివరణ ఇచ్చారు.

నేరస్తుల ఇళ్లను బుల్ డోజర్లతో కూల్చివేయడాన్ని యూపీ సీఎం యోగీ ఆదిత్యనాథ్ సమర్థించుకున్నారు. అభివృద్ధి పథంలో ఎవరైనా అడ్డంకులు సృష్టిస్తే, వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడానికి బుల్‌డోజర్‌లు, ఆధునిక యంత్రాలు అవసరమని కీలక వ్యాఖ్యలు చేశారు. ఉత్తరప్రదేశ్ లాంటి భారీ రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందాలంటే నేటి కాలంలో గడ్డపారలు కావాలా.. ఇంతకుముందు ఏదైనా పని ఆమోదం పొందితే మాఫియా వచ్చి అక్రమ ఆస్తులు లాక్కునేది.. గత ప్రభుత్వాలు వారిపై చర్యలు తీసుకునే సాహసం చేయలేదన్నారు.

తమ ప్రభుత్వం బుల్‌డోజర్‌లతో నేరస్తుల ఇళ్లను ఎందుకు కూల్చివేస్తోందని అడిగిన ప్రశ్నకు ముఖ్యమంత్రి బదులిస్తూ.. 'అక్రమంగా ప్రభుత్వ ఆస్తులను లాక్కున్న వారికి నేను హారతి ఇవ్వాలా అని ప్రశ్నించారు. నేరస్తులు, మాఫియాపై చర్యలు తీసుకోవాలని ఉత్తరప్రదేశ్ ప్రజలు కోరుకుంటున్నారని సమాధానమిచ్చారు. తమ ప్రభుత్వం కేవలం మైనారిటీ వర్గాలకు చెందిన నేరస్తులను మాత్రమే లక్ష్యంగా చేసుకుంటోందన్న ఆరోపణలను కూడా ఆయన తోసిపుచ్చారు.

యూపీలో ఓ అమాయక ముస్లిం వచ్చి తనకు అన్యాయం జరుగుతోందని చెప్పమనండి అని యోగీ ఆదిత్యనాథ్ సవాల్ విసిరారు. అలాగే అన్నింటికంటే ఎక్కువగా వారందరికీ కోర్టు ఉందన్నారు. మతంతో సంబంధం లేకుండా చట్టబద్ధమైన పాలన అందరికీ సమానమని, రాష్ట్ర ప్రజలకు భద్రత కల్పించాలని ఆదిత్యనాథ్ అన్నారు.

# ఈ ఏడాది శ్రీవారికి రెండు బ్రహ్మోత్సవాలు



**తిరుమల, (విశాఖ సమాచారమ్):** అధికమాసం సందర్భంగా ఈ ఏడాది తిరుమల శ్రీవారికి రెండు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. సెప్టెంబరు 18 నుంచి 26వ తేదీ వరకు సాలకట్ల బ్రహ్మోత్సవాలు, అక్టోబరు 15 నుంచి 23 వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి సోమవారం సాయంత్రం తిరుమలలోని అన్నమయ్య భవనంలో అధికారులతో సమీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ..రెండు బ్రహ్మోత్సవాలతో పాటు సెప్టెంబరు 18 నుంచి అక్టోబరు 17వ తేదీ వరకు పెరటాసి మాసం కూడా ఉన్న క్రమంలో భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశముందన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని విభాగాల అధికారులు, జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని ఏర్పాట్లు చేస్తామన్నారు. సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో 18వ తేదీన ధ్వజారోహణం సందర్భంగా ముఖ్యమంత్రి ప్రభుత్వం తరపున శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారన్నారు. 22న గరుడసేవ, 23న స్వర్ణరథం, 25న రథోత్సవం, 26న చక్రస్నానంతో సాలకట్ల బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని వివరించారు. నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో అక్టోబరు 19న గరుడవాహనం, 22న స్వర్ణరథం, 23న చక్రస్నానం జరుగుతాయన్నారు. గతేడాది తరహాలోనే ఈ ఏడాది కూడా గరుడవాహన దర్శనం మాడవీధుల వెలుపల ఉండే భక్తులకూ చేయిస్తామన్నారు. పెరటాసి మాసంలో దివ్యదర్శనాన్ని రద్దు చేస్తామన్నారు. వీఐపీ బ్రేక్ దర్శనాలను కూడా ప్రొటోకాల్‌కే పరిమితం చేస్తామన్నారు.

# మెల్ బోర్న్ లో వేటకొడవళ్లతో దాడి...ఇండియన్ పై ఘోరం!



ఈమధ్యకాలం లో విదేశాల్లో ఉంటున్న భారతీయ సంతతికి చెందిన వ్యక్తులు, మరి ముఖ్యంగా టీనేజర్స్ కి సంబంధించిన దారుణ విషయాలు జరుగుతోన్న సంగతి తెలిసిందే. తుపాకీ కాల్పులు, కత్తి పోట్లు, బైక్ కోసం కొట్టి చంపడాలు... ఒకటేమిటి ఎన్నో సంఘటనలు నిత్యం వెలుగు లోకి వస్తూనే ఉన్నాయి.

ఇదే సమయంలో తాజాగా మెల్ బోర్న్ లో ఒక షాకింగ్ సంఘటన జరిగింది. భారతీయ సంతతికి చెందిన ఒక బాలుడిపై కొడవళ్లతో దాడికి పాల్పడింది ఒక ముఠా. ఈ దాడి లో ఆ బాలుడు తీవ్రంగా గాయాపడ్డాడు.. ఇది ఆ బాలుడి బర్త్ డే నాడు జరగడం గమనార్హం.

అవును... మెల్ బోర్న్ లోని టార్నీట్ సిటీ లో ఒక ఘోరం చోటుచేసుకుంది. భారతీయ సంతతికి చెందిన రియాన్ సింగ్ అనే 16 ఏళ్ల బాలుడు.. తన ఇద్దరు స్నేహితులతో కలిసి బాస్కెట్ బాల్ ఆడుకుంటున్నాడు. ఆరోజు తన పుట్టినరోజు కావడంతో మరింత ఖుషీగా ఉన్నాడు. ఈ సమయంలో దాదాపు ఏడెనిమిది మంది వ్యక్తులు కొడవళ్లతో వారిపై అకస్మాత్తుగా దాడి చేశారు.

ఈ సందర్భంగా ర్యాన్ సింగ్ తో పాటు తన ఇద్దరు స్నేహితులపైనా దాడి చేసిన దుండగులు... ఆ ముగ్గురినీ మొబైల్ ఫోన్ లను ఇవ్వమని డిమాండ్ చేశారు. ఇదే సమయం లో నైక్ ఎయిర్ జోర్డాన్ స్నీకర్ లను ఇవ్వమని బలవంతం చేశారు.. అయితే అది అతను ఇప్పుడే అందుకున్న బహుమతి.

దీంతో రియాన్, అతని స్నేహితులు అనేకసార్లు కత్తిపోట్లకు గురయ్యారు.. ఫలితంగా వారి పక్కటెముకలు, చేతులు, వీపుల కు తీవ్ర గాయాలు అయ్యాయి. వీరిలో ఒక స్నేహితుడికి తల వెనుక భాగంలో కూడా బలమైన గాయమైంది. ఈ సమయంలో వీరిని నిలువుదోపిడీ చేసుకున్న దుండగులు అక్కడ నుంచి పారిపోయారు.

ఈ సందర్భంగా రియాన్ తల్లి.. ఈ సంఘటన పై తీవ్ర ఆవేదనను వ్యక్తం చేశారు. రియాన్ పుట్టినరోజు ను సందర్భంగా అతడికి ఇష్టమైన చీజ్ కేక్ తో కుటుంబ విందును ప్లాన్ చేసిందని తెలిపారు. ప్రస్తుతం రియాన్, అతని స్నేహితులు ఆసుపత్రిలో కోలుకొంటున్నారు.

మరోపక్క ఈ సంఘటన కు సంబంధించి విక్టోరియా పోలీసులు స్పందించారు. సాయుధ దోపిడీ, కత్తితో దాడి ఘటన కు సంబంధించి 20 ఏళ్ల యువకుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ దారుణమైన దాడికి బాధ్యులైన వారికి న్యాయం చేసేందుకు అధికారులు తీవ్రంగా కృషి చేస్తున్నారు.

# తిరుమల అలిపిరి మెట్ల మార్గంలో ఎలుగుబంటి



తిరుపతి: ప్రఖ్యాత పుణ్యక్షేత్రం తిరుమలలో భక్తుల రద్దీ తగ్గింది. కంపార్ట్‌మెంట్లల్లో భక్తులు స్వామివారి దర్శనం కోసం పెద్దగా వేచి ఉండనక్కర్లేదు. నేరుగా క్యూలైన్ల ద్వారా భక్తులు శ్రీవారిని దర్శించుకోవచ్చు. సర్వదర్శనం టోకెన్లు ఉన్న భక్తులకు దర్శనానికి 8 నుంచి 10 గంటల సమయం పడుతోంది.

సోమవారం 68,601 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. వారిలో 23,396 మంది తలనీలాలను సమర్పించుకున్నారు. హుండీ ద్వారా 5.21 కోట్ల రూపాయల ఆదాయం తిరుమల తిరుపతి దేవస్థానానికి అందింది. ఈ నెలలో స్వామివారి విశేష ఉత్సవాల సందర్భంగా భక్తుల తాకిడి మరింత పెరుగుతుందని టీటీడీ అధికారులు అంచనా వేస్తోన్నారు. దీనికి అనుగుణంగా చర్యలు తీసుకుంటోన్నారు.

కాగా- తిరుమలలో ఎలుగుబంటి కనిపించడం భక్తులను ఒకింత ఆందోళనకు గురి చేసింది. తిరుపతి- తిరుమల అలిపిరి మెట్ల మార్గంలో ఓ ఎలుగుబంటి తిరుగాడింది. అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో మెట్ల మార్గాన్ని దాటుతూ కనిపించింది ఈ ఎలుగుబంటి. అలిపిరి మెట్ల మార్గంలో ఉండే జింకల పార్కు సమీపంలో ఈ ఎలుగుబంటి దర్శనం ఇచ్చింది.

అర్ధరాత్రి కావడం వల్ల ఆ సమయంలో అలిపిరి మెట్ల మార్గంలో రాకపోకలు సాగిస్తోన్న భక్తుల సంఖ్య పెద్దగా లేదు. తిరుమలకు వెళ్తోన్న ఒకరిద్దరు భక్తులు తమ మొబైల్ ఫోన్లల్లో ఈ ఎలుగుబంటిని చిత్రీకరించారు. అనంతరం దీన్ని వాట్సప్ ద్వారా టీటీడీ అటవీ విభాగం సిబ్బందికి పంపించారు. సమాచారం అందుకున్న వెంటనే వారు జింకల పార్కు వద్దకు చేరుకున్నారు. భక్తులు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

# ఏపీలో ఎన్నికల నోటిఫికేషన్ ఫిబ్రవరిలోనే



పలాస నియోజకవర్గంలో గతంలో కంటే ఎక్కువ మెజారిటీ సాధించేందుకు అంతా కలిసి కట్టుగా పని చేయాలని ఈ సందర్భంగా కేడర్ కు మంత్రి సూచించారు.

ఆంధ్రప్రదేశ్లో రానున్న సార్వత్రిక ఎన్నికలపై రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు క్లారిటీ ఇచ్చారు. 2024 సంవత్సరం ఫిబ్రవరిలోనే ఆంధ్రప్రదేశ్లో ఎన్నికలకు నోటిఫికేషన్ ఉంటుందని స్పష్టం చేశారు. నోటిఫికేషన్ వచ్చిన నెల రోజులకే ఎన్నికలు ఉంటాయని కూడా ఆయన తెలిపారు. శ్రీకాకుళం జిల్లా పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీకి చెందిన కౌన్సిలర్లు, బూత్ కన్వీనర్లతో నిర్వహించిన సమావేశంలో మంత్రి ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

## సిపిఐ సీనియర్ నాయకులు మాకిరెడ్డి దేవుడు అకాల మరణం



నర్సీపట్నం, (విశాఖ సమాచారమ్): నర్సీపట్నం మండలం గబ్బాడ గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకులు మాకిరెడ్డి దేవుడు మంగళవారం అకాల మరణం చెందారు. సిపిఐ పార్టీలో ఎంతో సీనియర్ అయిన దేవుడు అకాల మరణం చెందడంతో సిపిఐ నాయకులు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఎన్నో పోరాటాలు చేసి ఎంతమందికి భూ పోరాటాల ద్వారా భూములు కల్పించిన దేవుడు మృతితో గబ్బాడ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# మరపురాని క్షణం: ప్రధాని మోడీ



లోకమాన్య తిలక్ జాతీయ అవార్డుతో సత్కరించడంపై ప్రధాని మోదీ మాట్లాడుతూ ఇది మరపురాని క్షణమంటూ పేర్కొన్నారు. ఈ ప్రైజ్ మనీని నమామి గంగే ప్రాజెక్టుకు విరాళంగా ఇవ్వాలని నిర్ణయించుకున్నాను. దేశంలోని 140 కోట్ల మంది ప్రజలకు ఈ అవార్డును అంకితం చేయాలనుకుంటున్నానని తెలిపారు. భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో లోకమాన్య తిలక్ పాత్ర.. సహకారం ఎప్పటికీ ఆదర్శమని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

# 5న రాజాం అసెంబ్లీ సమీక్ష

**విజయనగరం:** అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్షల్లో భాగంగా ఆగష్టు 5వ తేదీ ఉదయం 10.30 గంటలకు జరుగవలసిన రాజాం అసెంబ్లీ నియోజకవర్గ సమీక్ష సమావేశం అదేరోజు మధ్యాహ్నాం 3.00 గంటలకు జరుగుతుందని జిల్లా కలెక్టర్ శ్రీమతి నాగలక్ష్మి తెలిపారు. జిల్లా ఇన్ ఛార్జి మంత్రి అధ్యక్షతన కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో యీ సమావేశం జరుగుతుందన్నారు. ఆరోజు ఉదయం వైద్య ఆరోగ్యశాఖ మంత్రి జిల్లా పర్యటన వున్నందున మధ్యాహ్నాంకు రాజాం అసెంబ్లీ సమీక్ష మార్పు చేయడం జరిగిందని పేర్కొన్నారు.

# ఈనెల 9న ప్రపంచ ఆదివాసి దినోత్సవం. విజయవంతం చేయండి

## ప్రపంచ ఆదివాసి దినోత్సవం సెలవు దినము ప్రకటించాలి

## ఆదివాసి కాంగ్రెస్ రాష్ట్ర చైర్ పర్సన్ పాచి పెంట శాంత కుమారి



**అరకులోయ, (విశాఖ సమాచారమ్):** అరకు వేలి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియా మిత్రులు తో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది ఈ సందర్భంగా ఆదివాసి కాంగ్రెస్ రాష్ట్ర చైర్ పర్సన్ , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మరియుఅరకు వేలి నియోజకవర్గం ఇంచార్జి శ్రీమతి పాచిపెంట శాంత కుమారి మాట్లాడుతూ ముందుగా ఆదివాసి సోదరి, సోదరిమణులకు ప్రపంచ ఆదివాసి దినోత్సవ హార్దిక శు భాకాంక్షలు తెలియజేశారు ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా సెలవు దినముగా కేంద్ర రాష్ట్ర. ప్రభుత్వాలు సెలవు దినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు తేదీ 09.08.23న రాష్ట్ర ఆదివాసి విభాగం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉదయం 10:00 గంటలకు NTR పార్క్ నుండి ఆదివాసి సాంప్రదాయం దింసా.నృత్యం ర్యాలీ తో అంజలి రెసిడెన్సి వద్ద. ఆదివాసుల. హక్కులు. చట్టాలు. పటిష్టంగా అమలుకై. ప్రపంచ ఆదివాసి దినోత్సవం ఘనంగా ఆదివాసి సంప్రదాయాలతో సభ జరుపుకోవడం జరుగుతుంది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలు, AICC మెంబర్స్, నేషనల్ ఎస్సీ ఎస్టీ,బిసి & మైనారిటీ విభాగాలు సమన్వయకర్త గౌరవ కొప్పుల రాజుగారు, నేషనల్ ఆదివాసి చైర్మన్ గౌరవ శివాజీరావ్ మోగే గారు ,ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ రథసారథి గౌరవనీయులు గిడుగు రుద్ర రాజుగారు తో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్లు. ఎస్సీ,ఎస్టీ,బీసీ. మరియు మైనారిటీ. విభాగం రాష్ట్ర చైర్మన్లు. రాష్ట్ర నలుమూలల అన్ని విభాగాల రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు హాజరవుతున్నారు కనుక కాంగ్రెస్ పార్టీ అన్ని విభాగాలు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు శ్రేణులు అభిమానులు ఆదివాసి అక్క చెల్లెలు అన్నదమ్ములు పెద్దలు ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయగలరని కోరుచున్నాము ఈ కార్యక్రమంలో ఆదివాసి విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్లు. వంతల గోపీనాథ్ ,తెలగంజి సోమేశ్వరరావు, విజయనగరం జిల్లా ఎస్టీ విభాగం చైర్ పర్సన్ చీమల అచ్చిబాబు, %ూా=% జిల్లా ఉమెన్స్ రైట్స్ చైర్మన్ సమర్థి బంగార్రాజు, అరకు వేలి మండల అధ్యక్షులు ఎస్టీ విభాగం కొర్ర రఘురాం, కాంగ్రెస్ పార్టీ ఎస్. కోట ఇంచార్జి గాడి. బంగారు నాయుడు,బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొర్ర.పోతురాజు, మండల అధ్యక్షులు బోయి మోహన్ రావు, ప్రధాన కార్యదర్శి శెట్టి భగత్ రాం, మహిళా అధ్యక్షురాలు గొల్లోరి పద్మ , సీనియర్ నాయకులు జంపారంగి వెంకట్ బాబు, బురిడీ రాంబాబు, బోయి రఘు, పాచిపెంట మాలతి, కుంబిడిశెట్టి సుశీల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జనసేన క్రియాశీలక సభ్యత్వం

## జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ సూర్యచంద్ర



**నర్సీపట్నం, (విశాఖ సమాచారమ్):** జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం కార్యకర్తల భవితవ్యం అని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర అన్నారు. మంగళవారం నర్సీపట్నం ఎన్జీఒ హోమ్‌లో జనసేన పార్టీ టౌన్ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్ ఆధ్వర్యంలో జనసేన క్రియాశీలక సభ్యత్వ కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన సభ్యత్వం తీసుకున్న వారికి సూర్యచంద్ర చేతుల మీదుగా ఈ కిట్లను అందజేశారు. అనంతరం సూర్యచంద్ర మాట్లాడుతూ రేపటి తరాల భవిష్యత్తు కాంక్షించి, సమ సమాజ శ్రేయస్సుకు బాటలు వేస్తూ ఒక నిర్దిష్ట లక్ష్యంతో, ఆశయాల బాటలో సిద్ధాంతాల సాయంతో సామాన్యులు సైతం రాజకీయం చేసేలా యువత కలలు సాకారం అయ్యేలా జనసేన పార్టీని పవన్‌కళ్యాణ్ స్థాపించారన్నారు. జనం కోసం మేమున్నాం అనే ధైర్యం నింపుతూ ఎన్నో ప్రజా సమస్యలపై గళమెత్తి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న జనసేనాని పవన్ కళ్యాణ్ అడుగుల్లో నడుస్తూ ఆశయాల ప్రయాణాన్ని సాగిస్తున్న తన సైన్యం ఎలాంటి అపత్కాలంలో ఇబ్బందులు పడకూడదని ఎంతో నిబద్ధతతో పార్టీ భావజాల వ్యాప్తికి, పార్టీ కార్యక్రమాలలో పాల్గంటూ పార్టీ కొరకు అనుక్షణం శ్రమించే తమ పార్టీ కార్యకర్తలను కుటుంబంగా భావించి వారి యోగ క్షేమాలు కాంక్షించి జనసేనాని చేపట్టిన మహా సంకల్పం ఈ క్రియా శీలక సభ్యత్వమన్నారు. నిరంతరం పార్టీ కొరకు శ్రమించే కార్యకర్తలకు 5 లక్షల భీమా సౌకర్యం అందించేలా ఈ కార్యక్రమం రూపొందించారన్నారు. సభ్యత్వం తీసుకొనే వారు నామమాత్రంగా కొద్దిపాటి రుసుంను వారి వ్యక్తిగత బాధ్యతగా భావించి 500 చెల్లిస్తే ప్రమాదవశాత్తు మరణం సంభవిస్తే రూ.5లక్షల భీమా కుటుంబ సభ్యులకు అందించడం జరుగుతుందన్నారు. అలాగే ఏదైనా ప్రమాదం జరిగితే రూ.50వేలు ప్రమాద భీమాతో పాటు ప్రపంచంలో ఎక్కడైనా వైద్య సేవలు అందుకునే వెసులుబాటుతో పాటు ఆరోగ్య భీమా అందిస్తారన్నారు. కావున జనసేన పార్టీ సభ్యత్వనమోదు చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టౌన్ నాయకులు మారిశెట్టి రాజా, 12వ వార్డు ఇన్‌చార్జ్ గూడెపు తాతబాబు, చిరంజీవి శ్రీను, పెనుబోతల నాగు, కొత్తకోట రామశేఖర్, గొలుగొండ మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు బోయిన చిరంజీవి, మాకవరపాలెం నాయకులు కర్రి సంతోష్, నాతవరం మండల నాయకులు వేగిశెట్టి శ్రీనివాస్, బైన మురళీ, రామకృష్ణ, వాసం వెంకటేష్, జనసైనికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రోడ్ల విస్తరణపై ఎమ్మెల్యే గణేష్ తన వైఖరిని స్పష్టం చేయాలి

## జనసేన పార్టీ నర్సీపట్నం టౌన్ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్




**నర్సీపట్నం, (విశాఖ సమాచారమ్):** నర్సీపట్నం ప్రధాన రోడ్డు విస్తరణపై ఎమ్మెల్యే గణేష్ తన స్పష్టమైన వైఖరిని ప్రజలకు తెలియజేయాలని జనసేన పార్టీ నర్సీపట్నం టౌన్ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్ డిమాండ్ చేశారు. మంగళవారం జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టౌన్ అధ్యక్షులు గణేష్ మాట్లాడుతూ 100 అడుగుల రోడ్డు విస్తరణ చేస్తామని చెప్పి కౌన్సిల్‌లో తీర్మానం చేశారన్నారు. మళ్లీ 90 అడుగులు చేస్తామని ప్రకటించారని, రోడ్ల విస్తరణపై ఎమ్మెల్యే గణేష్ వైఖరి ఏంటో ప్రజలకు తెలియజేయాలన్నారు. 90 అడుగులకు రోడ్డు విస్తరణ చేస్తారంటే అప్పుడు 100 అడుగులకు కౌన్సిల్‌లో ఎందుకు తీర్మానం చేశారని ప్రశ్నించారు. ఇప్పుడు 90 అడుగులకు విస్తరణ చేస్తామంటే ప్రభుత్వ స్థలాల్లో 100 అడుగులు ఎందుకు కొట్టారన్నారు. నర్సీపట్నంలో ఎటువంటి అభివృద్ధి చేశారో ఎమ్మెల్యే ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. నిన్న జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో గిరిజన కౌన్సిలర్ చెప్పుతో కొట్టుకునే పరిస్థితికి తెచ్చారన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మున్సిపాలిటీలో తిరుగుతున్న ఎమ్మెల్యేకు ఇక్కడ సమస్యలు కనిపించలేదా అని ప్రశ్నించారు. టౌన్ నాయకులు మారిశెట్టి రాజా మాట్లాడుతూ నర్సీపట్నం రోడ్డు విస్తరణ నేపథ్యంలో ఎమ్మెల్యే మాట మాట్లాడటం సరైంది కాదన్నారు. 100 అడుగులు అని చెప్పి ఇప్పుడు 90 అడుగులు రోడ్డు విస్తరణ చేస్తామని ప్రకటించారని, అయితే గతంలో 120 అడుగులకు రోడ్డు విస్తరణ చేయాలని నర్సీపట్నం అభివృద్ధి కమిటీ పేరుతో ర్యాలీలు, నిరసనలు తెలిపిన వారు ఇప్పుడు ఎక్కడున్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే రోడ్డు విస్తరణపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో 12వ వార్డు ఇన్‌చార్జ్ గూడెపు తాతబాబు, చిరంజీవి శ్రీను, పెనుబోతల నాగు, కొత్తకోట రామశేఖర్, గొలుగొండ మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు బోయిన చిరంజీవి, మాకవరపాలెం నాయకులు కర్రి సంతోష్, నాతవరం మండల నాయకులు వేగిశెట్టి శ్రీనివాస్, బైన మురళీ, రామకృష్ణ, వాసం వెంకటేష్, జనసైనికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సిసి రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం



**నర్సీపట్నం, (విశాఖ సమాచారమ్):** నర్సీపట్నం మున్సిపాలిటీ పెదబొడ్డేపల్లి 12వ వార్డు దళిత వాడలలోని మట్టి రోడ్లకు మంగళవారం మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఇందిరా కాలనీలోని మూడు వీధులలో గల మూడు మట్టి రోడ్లను సిసి రోడ్లుగా వేయటకు ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ ఆశీస్సులతో ప్రారంభించారు. ఎన్నో ఏళ్ల సిసి రోడ్ల కల నెరవేరినందుకు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ చైర్ పర్సన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

### శ్రావణ పౌర్ణమిని పురస్కరించు బొజ్జన్న కొండపై

# బుద్ధునికి ప్రత్యేక పూజలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి మణిహారం శంకరం లో గల ప్రాచీన బౌద్ధ ఆధ్యాత్మిక క్షేత్రం " బొజ్జన్న కొండ " బౌద్ధ అభిమాన సంఘాల ముఖ్య సభ్యులు, పర్యాటక సందర్శకులు పాల్గొని బొజ్జన్న కొండ పై గుహలో గల బౌద్ధ స్తూపం వద్ద కొవ్వొత్తులు వెలిగించి పూలు,పండ్లు సమర్పించి భగవాన్ బుద్ధునికి బౌద్ధుల పవిత్ర పుణ్య,దినం శ్రావణ పౌర్ణమి సందర్భముగా బుద్ధ వందనం కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. బుద్ధునికి ప్రత్యేక పూజలు,ప్రార్ధనలు చేసి ప్రపంచ వ్యాప్తంగా శాంతి నెలకొని ప్రజలందరూ బుద్ధుని ఆశీస్సులతో సుఖ,సంతోషాల తో ఉండాలని బుద్ధ భగవానుని ప్రార్థించారు.అలాగే మణిపాల్ లో జరుగుతున్న హింసా,మారణకాండ చల్లారి ప్రజలు ఆనందముగ జీవించేలా బుద్ధ భగవానుని శాంతి దీవెనలు లభించాలని బుద్ధుని ప్రార్ధించడం జరిగిందని సిద్ధార్ధ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేష న్ వ్యవస్థాపక అధ్యక్షులు బల్లా నాగభూషణము తెలిపారు.

కార్యక్రమ నిర్వాహకులుఅనకాపల్లి జిల్లా బుద్దిస్ట్ సొసైటి ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ నేల పూడి బాల రాజు,విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి బోర వేణుగోపాల్ గౌతమ్, బుద్దిస్ట్ సొసైటీ సభ్యులు గిలకల అప్పారావు, కాపారపు సత్యనారాయణ,సందర్శక పర్యాటకులు, బొజ్జన్న కొండ సిబ్బంది పాల్గొన్నారు.

## స్పందన పరిష్కార సంతృప్తి పెరగాలి

### జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి

### స్పందనకు 303 దరఖాస్తులు

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** స్పందన (జగనన్నకు చెబుదాం) కార్యక్రమానికి వచ్చే దరఖాస్తులు ఫిర్యాదులపై చేసే పరిష్కారంపై ప్రజల లో సంతృప్త స్థాయి మరింత పెరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రవి పటాన్ శెట్టి ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం, జగనన్నకు చెబుదాం, అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధి సమీక్షలలో వచ్చిన అంశాలన్నింటి పైన స్పష్టమైన సమాధానాలు ఇచ్చి వీలైనంత వేగంగా పరిష్కరించాలన్నారు. ఈరోజు స్పందన కార్యక్రమానికి 303 దరఖాస్తులు, ఫిర్యాదులు వచ్చాయి. స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, అసిస్టెంట్ కలెక్టర్ స్మరణ్ రాజ్, డిఆర్ఓ పి. వెంకటరమణ, డ్వామా పిడి ఇ.సందీప్ దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మిషన్ ఇంద్ర ధనుష్ విజయవంతం చేయండి

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** మూడు దశల్లో నిర్వహించనున్న మిషన్ ఇంద్ర ధనుష్ విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రవి పట్టణ శెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన వైద్య, విద్య, మహిళా శిశు సంక్షేమం, మున్సిపల్ శాఖల అధికారులతో వెబ్ ఎక్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రొటీన్ ఇమ్యూనేజేషన్ లో టీకాలు తీసుకోని / ఇవ్వబడని 0-5 సంవత్సరాల పిల్లలను గుర్తించి వారికి టీకాలు వేయడమే మిషన్ ఇంద్ర ధనుష్ లక్ష్యం అని చెప్పారు. సర్వేలో గుర్తించిన పిల్లలందరికీ టీకాలు వేయాలన్నారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాలలో స్లమ్ ప్రాంతాలలో ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. వీరందరికి 3 విడతల్లో టీకాలు వేయాలని, ఆగష్టు 7 నుండి 12, సెప్టెంబర్ 11నుండి 16, అక్టోబర్ 9 నుండి 14 వరకు ప్రక్రియ జరుగుతుందన్నారు.

అంగన్వాడి కార్యకర్తలు ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది, ఎంఈఓ లు మున్సిపల్ అధికారులు సహకారంతో సచివాలయాలు గ్రామీణ, పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో టీకాలు ఇవ్వబడతాయని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. ఏ హేమంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈవో వెంకట లక్ష్మమ్మ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పిడి అనంతలక్ష్మి, డి సి హెచ్ ఎస్ డాక్టర్ శ్రావణ్ కుమార్, డబ్ల్యూహెచ్వో యూనిసెఫ్ ప్రతినిధులు హర్షిత్ కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ పాలనలో బీసీలకు రక్షణ కరువైంది




**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** బీసీలను అవమానపరిచిన మహదేవి వెంకటరమణ, జోగి రమేష్ వెంటనే బీసీలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ స్థానిక భీమవరం అంబేద్కర్ విగ్రహం వద్ద బిసి నేత మళ్ళ సురేంద్ర ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పీలా గోవింద సత్యనారాయణ పాల్గొనీ ప్రసంగించారు.

ఆంధ్రప్రదేశ్ లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక బీసీలకు రక్షణ కరువైందని బీసీల హత్యలన్ని ప్రభుత్వ హత్యలు గానే పరిగణించాలనీ అన్నారు.వైసిపి బీసీ మంత్రులు,ఎమ్మెల్యేలు, నాయకులు బీసీలకు జరుగుతున్న అన్యాయంపైన బీసీలపై జరుగుతున్న దాడులను ఏమాత్రం ప్రశ్నించడం లేదు.రాష్ట్రంలో ఉన్న బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వినియోగించుకుని పదవులు అనుభవిస్తున్నారనీ విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలందరూ జగన్ రెడ్డికి బుద్ధి చెప్పి గద్దె దించాలని కోరారు. బీసీ నేత మల్ల సురేంద్ర మాట్లాడుతూ వైసీపీ నాయకులకు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ప్రజలు తమ ఓటు అనే ఆయుధం ద్వారా తగిన బుద్ధి చెబుతారు. బీసీల కోసం బీసీల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి హామీలను గాలికొదిలేశారు, బీసీల ఆర్థిక అభివృద్ధి కోసమని 56 కార్పొరేషన్లను ఏర్పాటు చేసి ఆ కార్పొరేషన్లకు ఒక రూపాయి కూడా నిధులు విడుదల చేయకుండా కార్పొరేషన్లను నిర్వీర్యం చేసి బీసీలను ఆర్థికంగా ఎదగనివ్వకుండా కుట్ర పన్నారని విమర్శించారు. వైసీపీ నాయకులు తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు నిర్వహించిన పాదయాత్రలో

భాగం జూలై 27న తెలుగుదేశం జాతీయ కార్యదర్శి నారా లోకేష్ నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమానికి హాజరైన బీసీ సోదరులను పెయిడ్ ఆర్టిస్టులు అనడం చాలా బాధాకరం, తెలుగుదేశం పార్టీ అమర్నాథ్ గౌడ్ కుటుంబానికి అండగా నిలవడం జరిగినది. దీనిని జీర్ణించుకోలేని వైసిపి నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. వైసిపి నాయకులు అమర్నాథ్ గౌడ్ ది ఆత్మహత్య అని చిత్రీకరించడం చాలా దారుణంఅని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బవరపు గణేష్, కాయల మురళి,గవర రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆడారి వెంకట్రావు, యల్లపు శ్రావణ్ కుమార్, అనకాపల్లి జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు గిరిజాల లక్ష్మణరావు, 82వ డివిజన్ ఇంచార్జ్ పోలరపు త్రినాథ్, అనకాపల్లి జిల్లా గవర సాధికారిత అధ్యక్షులు మళ్ళ లవ కృష్ణ, తలారి కాశీ నాయుడు,విశాఖపట్నం బీసీ సెల్ అధ్యక్షులు తమ్మిన విజయ్ కుమార్, విశాఖ జిల్లా గవర సాధికారిత అధ్యక్షులు కాండ్రేగుల వెంకటేశ్వరరావు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి భీమరశెట్టి శ్రీనివాసరావు,నూకరాజు, బీసీ సెల్ అనకాపల్లి జిల్లా కార్యదర్శి దాడి జగన్, బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెలలో రెండు పున్నములు- ఏం జరుగుతుంది?

**న్యూఢిల్లీ:** అంతరిక్షం.. అద్భుతాలమయం. ఈ విశ్వాంతరాల్లో సంభవించే ప్రతీదీ ఓ ఆశ్చర్యాన్ని కలిగించేదే. ప్రతి అద్భుతానికీ ఓ కారణం ఉంటుంది. కొద్దిరోజుల కిందటే పంచ గ్రహ కూటమి ఏర్పడింది. అయిదు గ్రహాలు ఒకే వరుసలో కనువిందు చేశాయి. బుధుడు, యురేనస్, గురుడు, నెప్ట్యూన్, శని గ్రహాలు.. ఆకాశంలో పరేడ్ చేశాయి. ఈ ఘట్టాన్ని ఎలాంటి పరికరాలు లేకుండానే నేరుగా వీక్షించగలిగారు.

ఇప్పుడు అలాంటి అరుదైన సందర్భం మరోసారి చోటు చేసుకోనుంది. ఈ నెలలో రెండు పున్నములు ఏర్పడబోతోన్నాయి. ఇందులో ఒకటి ఈ రాత్రికి సంభవించనుంది. ఈ నెలలో తొలి పౌర్ణమి ఇవ్వాళే. దీన్ని సూపర్ మూన్‌గా పిలుస్తారు. మరొకటి ఈ నెల 30వ తేదీన చోటు చేసుకుంటుంది. ఇది బ్లూ మూన్.



సాధారణంగా ఒక ఏడాదిలో రెండు లేదా మూడు సూపర్‌మూన్‌లు ఏర్పడుతుంటాయి. ఆగస్టు 30వ తేదీన ఏర్పడబోయే సూపర్‌మూన్ మాత్రం చాలా అరుదు. అలాంటి సందర్భాన్ని మళ్లీ 2032 వరకు మనం చూడలేకపోవచ్చు. ఫుల్ మూన్ సమయంలో, జాబిల్లి కక్ష్య భూమికి దగ్గరగా ఉన్నప్పుడు సూపర్‌మూన్ ఆవిష్కృతమౌతుంది.

సాధారణ పౌర్ణమి రోజుల కంటే కూడా సూపర్ మూన్ సమయంలో చందమామ మరింత ప్రకాశవంతంగా కనువిందు చేస్తాడు. పరిమాణంలోనూ భారీగా కనిపిస్తాడు. ఫార్మర్స్ అల్మానాక్ ప్రకారం చూసుకుంటే.. ఈ సంవత్సరంలో మొదటి పౌర్ణమి మంగళవారం మంగళవారం అంటే ఇవ్వాళే సంభవించింది. దీన్ని స్టర్జన్ సూపర్‌మూన్‌గా పిలుస్తారు.

స్టర్జన్ చంద్రుడిని గ్రీన్ కార్న్ మూన్, గ్రెయిన్ మూన్, ఫ్లయింగ్-అప్ మూన్, హార్వెస్ట్ మూన్, రైజింగ్ మూన్, బ్లాక్ చెర్రీస్ మూన్, మౌంటెన్ షాడో మూన్ అని కూడా పిలుస్తారు. ఒకే నెలలో రెండవసారి ఏర్పడే పున్నమి చంద్రుడిని బ్లూ మూన్‌గా భావిస్తారు. సగటున ప్రతి రెండున్నర సంవత్సరాలకు ఇలాంటి సందర్భం ఏర్పడుతుంటుంది. ఒకే నెలలో రెండు పున్నములు సంభవిస్తుంటాయని నాసా తెలిపింది.

ఒక సూపర్‌మూన్, బ్లూ మూన్‌తో కలిసి రావడం అరుదైన సందర్భమే. ఇది చివరిసారిగా 2009 డిసెంబర్‌లో ఇది సంభవించిందని నాసా పేర్కొంది. మళ్లీ 2032 ఆగస్టులో ఇది ఏర్పడుతుంది. ఆగస్టు 30వ తేదీ నాటి పున్నమి చంద్రుడిని బ్లూ మూన్‌గా పిలుస్తారు. అంతే తప్ప చందమామ నిజంగా నీలం రంగులో కనిపించదు.

హిందూ సంప్రదాయంలో ఒకే నెలలో సంభవించే రెండు పున్నములకు ప్రాధాన్యత ఉంది. అధికమాసం ఏర్పడినప్పుడు ఇలాంటి అరుదైన సందర్భం సంభవిస్తుంటుంది. ఆ సమయంలో యజ్ఞ యాగాదులు చేయాలని పెద్దలు చెబుతుంటారు. ఇవ్వాళ కూడా తిరుమల సహా పలు ఆలయాల్లో విశేష పూజలు, ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

# డాక్టర్ నిర్లక్ష్యంతో తల్లి గర్భంలోనే శిశువు మృతి

## ఆసుపత్రి ఎదుట బంధువుల నిరసన

**అనంతపురం:** నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి నిర్వాకం ఓ పసికందు నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. మహిళకు సిజేరియన్ చేసే క్రమంలో వైద్యుల నిర్లక్ష్యంతో పురిటి బిడ్డ గర్భంలోనే కన్నుమూసింది. డాక్టర్ నిర్లక్ష్యంతో సిజేరియన్ చేస్తుండగా శిశువుకు కత్తిగాట్లు అయ్యి తల్లి కడుపులోనే శిశువు మృతి చెందింది. ఈ దారుణ ఘటన అనంతపురం జిల్లాలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే..అనంతపురం పట్టణానికి చెందిన రేష్మభాణుకు పురిటి నొప్పులు వచ్చాయి. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను హుటాహుటీన నగరంలోని స్నేహలత హాస్పిటల్ ఆస్పత్రికి తరలించారు. నిండు గర్భిణీ అయిన రేష్మభాను జాయిన్ చేసుకుని చికిత్స నందించారు. సహజ ప్రసవం కాదని ఆమెకు సిజేరిన్ చేయాలని వైద్యులు తెలిపారు. చేసేదిలేక కుటుంబ సభ్యులు సరేనన్నారు. సిజేరియన్ చేస్తుండగా కడుపులో ఉన్న బిడ్డకు కత్తి కోసుకుంది. దీంతో తీవ్రంగా గాయపడ్డ శిశువు గర్భంలోనే చనిపోయింది. ఆ తర్వాత మృతి చెందిన బిడ్డను బయటకు తీసి కుట్లువేశారు. ఏమీ ఎరగనట్లు బిడ్డ కడుపులోనే మృతి చెందినట్లు బంధువులకు తెలిపారు. ఐతే బిడ్డ శరీరంపై కత్తిగాట్లు ఉండటం గమనించిన కుటుంబ సభ్యులు



ఆపరేషన్ నిర్వహించిన డాక్టర్ అరుణను నిలదీశారు. ఆమె బుకాయించడంతో బాధితురాలి బంధువులు స్నేహలత హాస్పిటల్ ఎదుర నిరసనకు దిగారు. వైద్యుల నిర్వాకం వల్లనే పండండి బిడ్డ చనిపోయిందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ అరుణ నిర్లక్ష్యంగా వ్యవహరిండం వల్లే బిడ్డ చనిపోయిందని బంధువులు ఆరోపిస్తున్నారు. సిజేరియన్ లో కత్తి కోసుకుని మృతి చెందిన ఆడ శిశువుతో హాస్పిటల్ ముందు బైఠాయించి కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు.

# అనారోగ్యంతో భాధపడుతున్న మోహన్‌ను పరామర్శించిన ముఖ్యమంత్రి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** మంగళవారం, విశాఖ జిల్లాలోపోర్టు ఆసుపత్రి దగ్గర ఇనార్బిట్ మాల్ శంఖు స్థాపనకు కార్యక్రమానికి చేరుకున్న ముఖ్యమంత్రి అక్కడ త్రీవ అనారోగ్యంతో భాధపడుతున్న మోహన్(17) ను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెందుర్తి మండలం వేపగుంటకు చేందిన వీరవల్లి మోహన్ తాను 4వ అంతస్తూ నుండి పడిపోయానని, వెన్నపూస దెబ్బ తిన్నదని ఆరోగ్య శ్రీ లో వైద్యం పొందినట్లు తెలిపారు. ఇంకా కోలుకోలేదని, వైద్య సేవల నిమిత్తం ముఖ్యమంత్రి ని సహాయం కోరగా ముఖ్యమంత్రి స్పందిచి ఫిజియో ధెరపి వైద్యం కోసం తక్షణ సహాయం కింద 1 లక్ష రూపాయల చెక్కును వీరవల్లి మోహన్ కు అందజేశారు. ఇంకా ఎద్దైన సమస్య వుంటే జిల్లా కలక్టరును కలవాలని సూచించారు.

# పార్లమెంట్లో భూమి లీజుకు చట్టబద్ధతపై వివరణ కోరిన ఎంపీ సత్యవతి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** భూమి లీజుకు చట్టబద్ధత కల్పించడం, వాటిని నమోదు చేయడం ఇతర విషయాలతోపాటు అద్దెపై నియంత్రణకు సంబంధించి వివిధ సంస్కరణల సూచనలతో కూడిన ఒక మోడల్ అగ్రికల్చరల్ ల్యాండ్ లీజింగ్ చట్టంపై 2016లో నీతి ఆయోగ్ చేసిన సూచనలను అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తుందా అని అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతి పార్లమెంట్ సమావేశాల్లో కోరారు . అలా అయితే, దాని వివరాలు తెలపాలని కోరారు. దీనికి వ్యవసాయం , రైతుల సంక్షేమ శాఖ మంత్రి కృషి ఏవం కిసాన్ కళ్యాణ మంత్రినరేంద్ర సింగ్ తోమర్ బదులిస్తూ నీతి ఆయోగ్ ఏర్పాటు చేసిన నిపుణుల బృందం దీనిపై ఒక నమూనా చట్టాన్ని సూచించిందన్నారు.

ఏప్రిల్ 12, 2016న బహిరంగపరచబడిన వ్యవసాయ భూమి లీజింగ్. రాష్ట్రాలు తమ స్వంత భూమి లీజింగ్ చట్టాలను రూపొందించడానికి వీలు కల్పించేందుకు ఈ నమూనా చట్టం రూపొందించబడిందన్నారు.

ఇంకా, ఉత్తరప్రదేశ్ మరియు ఉత్తరాఖండ్ ప్రభుత్వాలు భూమి లీజింగ్‌ను ప్రోత్సహించడానికి తమ లీజింగ్ చట్టాలను సవరించాయన్నారు. మధ్యప్రదేశ్ అసెంబ్లీ వ్యవసాయ భూమి లీజుకు 9 మే, 2018న ప్రచురించిన 'భూమిస్వామి ఏవం బటైదార్ కే హిట్టన్ కా సంరక్షణ చట్టం., 2016'ని రూపొందించిందన్నారు.

# ఆర్థోపెడిక్ సమస్యతో బాధపడుతున్న గవిడి ఢిల్లీశ్వరరావుకు ముఖ్యమంత్రి లక్ష రూపాయలు ఆర్థిక సహాయం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి తన మానవత్వాన్ని చాటుకున్నారు. మంగళవారం విశాఖ జిల్లా పర్యటనలో భాగంగా ఇనార్బిట్ మాల్ చేరుకున్న ముఖ్యమంత్రి, అక్కడ ఆర్థోపెడిక్ సమస్యతో బాధపడుతున్న గవిడి ఢిల్లీశ్వరరావు (9) ను ముఖ్యమంత్రి పరామర్శించారు. కంచరపాలెం, బాపూజీనగర్ కు చెందిన ఢిల్లీశ్వరరావు తల్లి గవిడి సంతోషి, తన కుమారుడు పుట్టుకతో ఆర్థోపెడిక్ సమస్య తో బాధపడుతున్నాడని ముఖ్యమంత్రికి తెలిపారు. వారి సమస్యను విన్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి గవిడి ఢిల్లీశ్వరరావుకి వైద్య సేవలు నిమిత్తం తక్షణమే లక్ష రూపాయల చెక్కును అందజేసారు.

# జిల్లా కలెక్టరేట్ కు చేరిన ఈవీఎం బాక్సులు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** 2024 లో జరుగునున్న ఎన్నికలకు, ఎన్నికల సామాగ్రి సిద్ధం చేయాలని ఉద్దేశంతో నూతనంగా ఏర్పాటైన అనకాపల్లి జిల్లాకు సోమవారం రాత్రి 10 గంటలకు ఏడు లారీలతో 935 ట్రంక్ పెట్టెలలో ఈవీఎం బాక్సులు కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకున్నయని జిల్లా తెలుగుదేశం పార్టీ తరపున పాల్గొన్న పార్లమెంట్ కార్యాలయం కార్యదర్శి బొలిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు.జిల్లా కలెక్టర్ పటాన్ శెట్టి రవి ఆధ్వర్యంలో రాజకీయ పార్టీ ప్రతినిధులు సమక్షంలో వాటిని భద్రపరచడం జరిగింది. రాబోయే ఎన్నికలకు సంబంధించి, బాక్సులు కౌంటింగ్ చేయగా ఈవీఎంలు కంప్యూటర్లు మొత్తం ,9350 బాక్సులను, ఉన్నతాధికారులు పోలీస్ యంత్రాంగం, ప్రధాన రాజకీయ పక్షాల సమక్షంలో గోడౌన్ లో భద్రపరచి సీల్ వేయడం జరిగిందని శ్రీనివాసరావు తెలిపారు. ఆర్డిఓ తదితర అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# వాలెంటరీ లంటే ప్రజలకు వణుకు పుడుతోంది

## ఆందోళనలో ప్రజలు

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖపట్నం నగరం లోని పెందుర్తి నియోజకవర్గంలోని లోని సుజాతానగర్ 95 వ డివిజన్ లో ఆదివారం రాత్రి ఒంటరిగా నివసిస్తున్న వరలక్ష్మి అనే వృద్ధురాలిని రమేష్ అనే వాలంటరీ హత్యచేసి వంటిపై బంగారు ఆభరణాలు దోచుకెళ్లిన దారుణం నగరంలో సంచలం కల్గించింది.

73 సంవత్సరాల వరలక్ష్మి ఒంటరిగా వుంటూ దుకాణం నడుపుతోంది. అదే డివిజన్ వాలంటీర్గా పనిచేస్తున్న రమేష్ ఆమె దుకాణంలోకూడా పని చేస్తున్నాడు.ఆదివారం రాత్రి 10.30 గంటల ప్రాంతంలో ఆమె ఉంటున్న అపార్ట్మెంట్లోని లిఫ్ట్ దిగినట్లు సి సి కెమెరా లో చిక్కిన వాలంటీర్ లోనికెళ్లి దిండుతో ఆమె ముఖం పై అదిమిపట్టి హత్యచేసినట్లు పోలీసులు గుర్తించి పెందుర్తి పోలీసులు అరెస్ట్ చేశారు.

ఈ ఘోరంకి కారణమైన వాలంటీర్కి ఉరిశిక్ష విధించాలని ప్రతిపక్ష పార్టీలు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఇలా ఉండగా ఇప్పటికే డేటా దుర్వినియోగం అవుతోందని వెళ్ళడైన నాటినుండి వాలంటర్లను అనేక చోట్ల గుమ్మం బయటే మాట్లాడి పంపించి వేస్తున్నారని, అసలు మునుపటిలా వాలంటీర్లు తమ ఏరియాల్లో కూడా కన్పించటం తగ్గిపోయిందని కారణం ప్రజలకు, వాలెంటీర్ల వ్యవస్థ శృతిమించి వ్యవహరించటం తో వారిపై నమ్మకం తగ్గి అనేక చోట్ల గేట్ బయటే మాట్లాడి పంపించటం, డేటా ఏరూపంలో కూడా ఇచ్చేందుకు అంగీకరించక పోవటం కారణంగా చెబుతున్నారు.

# ఈనెల 6న అనకాపల్లి రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ఈనెల 6న అనకాపల్లి రైల్వే స్టేషన్ అభివృద్ధికి భూమి పూజ కార్యక్రమం జరుగుతుందని అనకాపల్లి పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ సత్యవతి తెలిపారు. అనకాపల్లి రైల్వే స్టేషన్ అభివృద్ధి కోసం కేంద్ర రైల్వే శాఖ మంత్రి సౌత్ సెంట్రల్ జీఎం, డి ఆర్ ఎం లతో ప్రత్యేకంగా మాట్లాడమన్నారు. ప్రత్యేక కృషి తోనెర వేరుతున్న అనకాపల్లి జిల్లా వాసుల చిరకాల కోరిక నెరవేరుతుంది అన్నారు. ఈ భూమి పూజ కార్యక్రమం లో పార్ల మెంట్ సభ్యురాలు, సౌత్ సెంట్రల్ డిఆర్ఎం, డివిజనల్ అధికారులు.పెద్ద ఎత్తున ప్రజలు , రైల్వే ప్యాసింజర్ల అసోసియేషన్ సభ్యులు పాల్గొని కార్యక్రమాలు విజయవంతం చేయాల్సిందిగా ఎంపీ సత్యవతి కోరారు.

# డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం



**కాకినాడ, (విశాఖ సమాచారమ్):** డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమంలో నమోదు అయిన సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డా. కృతికాశుక్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం కాకినాడ కలెక్టరు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టరు డా. కృతికాశుక్లా ఉదయం 10:30 గంటల నుంచి 11.30 గంటల వరకు డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాల్లో వివిధ ప్రాంతాల నుంచి 13 మంది.. విద్య, ఉపాధి, భూ సర్వే, భూ సమస్యలు, డ్రైనేజీ, సీసీ రోడ్లు, లేఔట్ల క్రమబద్ధీకరణ, పారిశుద్ధ్యం వంటి సమస్యలపై టోల్ ఫ్రీ నెంబర్ 18004253077కు ఫోన్ చేసి జిల్లా కలెక్టరుకు నేరుగా తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కృతికాశుక్లా మాట్లాడుతూ ప్రజల సమస్యల్ని నేరుగా తెలుసుకునేందుకు డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని ప్రతి మంగళవారం నిర్వహిస్తున్నమన్నారు. ఫోన్ ద్వారా తెలియజేసిన 13 మంది వ్యక్తుల సమస్యలను పరిష్కారం నిమిత్తం సంబంధిత శాఖల అధికారులకు పంపించడం జరిగిందన్నారు. అధికారులు డయల్ యువర్ కలెక్టర్ కార్యాలయంలో నమోదైన సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి సకాలంలో పరిష్కారించాలని కలెక్టరు కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో కె. శ్రీధర్ రెడ్డి, కలెక్టరేట్ ఏవో జీఎస్ఎస్ శ్రీనివాసు వివిధ సెక్షన్ల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాయపాటి నివాసం సహా తొమ్మిదిచోట్ల ఈడీ సోదాలు



తెలుగుదేశం పార్టీ నేత, మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావు సహా ట్రాన్స్‌ట్రాయ్ డైరెక్టర్ల ఇళ్లలో ఈడీ సోదాలు నిర్వహించింది. హైదరాబాద్, గుంటూరులో తొమ్మిది చోట్ల ఈడీ బృందాలు తనిఖీలు నిర్వహిస్తున్నాయి. రాయపాటి హైదరాబాద్, జూబ్లి హిల్స్ లోని రోడ్ నెంబర్ 27లో నివసిస్తున్నారు. హైదరాబాద్‌తో పాటు గుంటూరులోని ఆయన నివాసాల్లో ఈడీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు.

ఈ కంపెనీ దాదాపు పదమూడు బ్యాంకుల నుండి తొమ్మిది వేల కోట్లకు పైగా రుణాలు తీసుకొని, డొల్ల కంపెనీలకు మళ్లించినట్లుగా సీబీఐ ఇదివరకు కేసు నమోదు చేసింది. సీబీఐ ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది. ట్రాన్స్‌ట్రాయ్ కంపెనీ ఖాతాల నుండి నిబంధనలకు విరుద్ధంగా సింగపూర్‌కు నగదు బదిలీ అయినట్లు ఈడీ అధికారులు అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం సోదాలు జరుగుతున్నాయి.

# బీజేపీలో ప్రక్షాళనకు రంగం సిద్ధం చేసుకున్న పురంధేశ్వరి

భారతీయ జనతాపార్టీ అధ్యక్షురాలు పురంధేశ్వరి భాధ్యతలు చేపట్టిన నాటి నుంచి దూకుడుగా ముందుకెళ్తున్నారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతం చేయడమే లక్ష్యంగా కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. బాధ్యతలు తీసుకున్న మొదటి రోజునుంచే ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వానికి, బీజేపీకి మధ్య రహస్య బంధం ఉందనే ఆరోపణలు తీవ్రంగా ఉండేవి. అలాంటి ఆరోపణలు రాకుండా జాగ్రత్తగా ముందుకెళ్లేలా ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాల వారీ పర్యటనలతో క్షేత్రస్థాయి పరిస్థితులు అంచనా వేసుకున్న బీజేపీ చీఫ్.. పార్టీ అనుబంధ విభాగాలతోనూ సమావేశమై కీలక సూచనలు చేసారు. ఇక ఆగస్ట్ నుంచి ప్రజాక్షేత్రంలో ఉద్యమాలకు పిలుపు నిచ్చారు. క్షేత్రస్థాయిలో అడుగుపెట్టడానికి ముందుగానే పార్టీలో కీలక మార్పులను చేస్తున్నారు పురంధేశ్వరి. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర విభాగంలో అధ్యక్షులుతో నలుగురు జనరల్ సెక్రటరీలు, పదిమంది వైస్ ప్రెసిడెంట్లు, మరో పదిమంది సెక్రటరీలు, ఒక ట్రెజరర్ ఉంటారు. ప్రస్తుతం ఉన్న ఈ కమిటీలో చాలామందిని మారుస్తూ కొత్త లిస్ట్ సిద్ధం చేసుకున్నారు పురంధేశ్వరి. ఇటీవల ఢిల్లీ పర్యటనలో కొత్త జాబితాకు కేంద్రపెద్దలు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం.



**కీలక మార్పులతో కొత్త జాబితా రెడీ..**

స్టేట్ కమిటీలో జనరల్ సెక్రటరీల స్థానాల్లో ప్రస్తుతం ఉన్న ఒకరిద్దరిని మార్పు చేసి కొత్త వారికి అవకాశం ఇచ్చినట్లు తెలిసింది. బీసీ, ఎస్సీ వర్గాలకు ప్రాధాన్యం ఇచ్చేలా కొత్త కూర్పు సిద్ధం చేసారు. ఉత్తరాంధ్ర, రాయలసీమతో పాటు నెల్లూరు, కర్నూలు, గుంటూరు జిల్లాల నుంచి బీసీలకు ప్రాధాన్యం ఇస్తూ జాబితా సిద్ధం చేసారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్న మాజీ ఎమ్మెల్సీ మాధవ్ కు వైస్ చైర్మన్ పదవి ఇస్తున్నట్లు బీజేపీ వర్గాలు చెప్పాయి. ఇక వీటితో పాటు మోర్చాల నేతలను కూడా మార్పులు చేస్తున్నట్లు తెలిసింది. కొత్త జాబితాను ఇప్పటికే ఢిల్లీకి పంపిన పురంధేశ్వరికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు చెబుతున్నారు. మార్పులు చేర్పులతో తన టీంను సిద్ధం చేసుకుని మరింత దూకుడుగా ముందుకు వెళ్లేందుకు పురంధేశ్వరి కసరత్తు చేస్తున్నారు.

**త్వరలో పవన్ కళ్యాణ్ తో భేటీ కానున్న పురంధేశ్వరి**

రాష్ట్రంలో జనసేనతో బీజేపీ పొత్తు కొనసాగుతుందని.. వచ్చే ఎన్నికల్లో రెండు పార్టీలు కలిసి బరిలో దిగుతాయని పురంధేశ్వరి పదేపదే చెప్పుకొస్తున్నారు. అంతేకాదు ప్రజా సమస్యలపైనా రెండు పార్టీలు కలిసి ఉద్యమాలు చేస్తామని కూడా చెప్పారు. ఇక తమ మిత్రపక్షం జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌తో గతంలో మాదిరిగా కాకుండా తరచుగా భేటీలు, సంప్రదింపులు ఉంటాయని ఇప్పటికే ప్రకటించారు. త్వరలో పవన్ కళ్యాణ్ తో భేటీ అవుతానని చెప్పిన పురంధేశ్వరి.. సమయం కోసం వేచిచూస్తున్నారట. పవన్ ఇటీవల ఢిల్లీ వెళ్లి కేంద్ర పెద్దలను కలిసి వచ్చిన తర్వాత రాష్ట్ర బీజేపీ నేతలతో సమావేశం ఉంటుందని గతంలో చెప్పారు. అయితే ఢిల్లీ నేతలతో కలివిడిగా ఉన్న పవన్.. రాష్ట్రంలో మాత్రం కమలం నేతలను ఇంతవరకూ పెద్దగా కలిసిన దాఖలాలు లేవు. అయినా అధ్యక్షురాలు మార్పు తర్వాత ఇద్దరూ భేటీ అవుతారని ఇటీవల తెలిపారు. దీంతో వచ్చే వారం పదిరోజుల్లో ఇద్దరు నేతలు భేటీ అవుతారని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. రెండు పార్టీలు కలిసి అధికార పార్టీపై ఆందోళనలు చేయడం, ఉద్యమ కార్యాచరణ దిశగా ముందుకెళ్లే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# జగనన్న సురక్ష... విజయవంతం

**విజయనగరం:** ప్రజల సమస్యలను తెలుసుకొని అక్కడికక్కడే నాణ్యమైన పరిష్కారం చూపేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జగనన్న సురక్ష ప్రత్యేక కార్యక్రమం జిల్లాలో విజయవంతంగా సాగిందని, అనుకున్న దానికంటే విజయవంతంగా సాగి ప్రజా మన్ననలు పొందిందని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి. ఎస్ పేర్కొన్నారు. జూన్ 23న లాంఛనంగా ప్రారంభమైన ఈ కార్యక్రమం ఆగస్టు ఒకటో తారీఖుతో ముగిసిందని, రోజు విడిచి రోజు నెల రోజుల పాటు సాగిన జగనన్న సురక్ష క్షేత్ర స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు వివిధ దశల్లో నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరాలు ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించగలిగాయని హర్షం వ్యక్తం చేశారు. నెల రోజుల పాటు జిల్లాలో సాగిన జగనన్న సురక్ష శిబిరాల ద్వారా ఎన్నో ప్రజా సమస్యలు పరిష్కారానికి వచ్చాయని, క్యాంపులు సత్ఫలితాలను అందించాయని పేర్కొంటూ జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి. ఎస్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

**5.16 లక్షల కుటుంబాలను సందర్శించిన సేవకులు**

ప్రత్యేక ప్రణాళికతో నెల రోజుల పాటు నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మండల, గ్రామ స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు జిల్లాలోని 5,16,394 కుటుంబాలను సందర్శించారు. అన్ని ప్రభుత్వ శాఖల పరిధిలో ఉండే వివిధ కేటగిరీలకు చెందిన సమస్యలపై వినతులు స్వీకరించారు. ఈ క్రమంలో 4,89,714 టోకెన్లు నమోదు కాగా 4,74,420 ప్రజా వినతులకు శాశ్వత పరిష్కారం చూపారు. 111 కేటగిరీలకు సంబంధించిన సేవలను ఉచితంగా అందజేశారు. జిల్లాలో 6,27,168 కుటుంబాలు ఉండగా అందులో 5,16,394 కుటుంబాలను ప్రభుత్వ సేవకులు సందర్శించి నాణ్యమైన సేవలందించారు. 96.88 శాతం ఫలితాలను సాధించి ఉత్తమ ఫలితాలు సాధించిన జిల్లాల సరసన విజయనగరం నిలవటం హర్షణీయమని జిల్లా కలెక్టర్ ప్రకటనలో పేర్కొన్నారు.



**మిషన్ మోడ్‌లో ప్రత్యేక శిబిరాలు...**

జిల్లా స్థాయి నుంచి క్షేత్ర స్థాయి వరకు ప్రతి ఒక్కరూ సరైన ప్రవర్తనా నియమావళి పాటిస్తూ ప్రజలకు మరింత చేరువయ్యేలా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి.ఎస్ సురక్ష ప్రారంభంలో పిలుపునిచ్చారు. జిల్లాలోని అన్ని సచివాలయాల పరిధిలో అందరూ భాగస్వామ్యం కావాలని, ప్రజా సమస్యలను ముందుగానే గుర్తించి శిబిరం రోజు వాటికి సరైన పరిష్కారం చూపుతూ సంబంధిత ధృవ పత్రాలు మంజూరు చేయాలని సూచించారు. దీనికి గాను ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకొని 111 రకాల సేవలను మిషన్ మోడ్‌లో ప్రజలకు అందించాలని పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాలను అనుసరించి ఆయా మండలాలు, మున్సిపాలిటీల పరిధిలోని అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ, వార్డు వాలంటీర్లు భాగస్వామ్యమై విజయవంతం కావటంలో కీలక పాత్ర పోషించారు.

**దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం**

రెవెన్యూ, పురపాలక పట్టణాభివృద్ధి శాఖ, రిజిస్ట్రేషన్ స్టాంపులు, వ్యవసాయ, ఆధార్, పౌరసరఫరాలు, గ్రామ వార్డు సచివాలయాలు, గ్రామీణాభివృద్ధి, కార్మిక, వైద్య ఆరోగ్య, పోలీసు, విద్యుత్తు, దేవాదాయ, వక్ఫ్, భాషా సాంస్కృతిక శాఖ, ఫ్యాక్టరీలు తదితర శాఖల ద్వారా వివిధ సేవలు అందించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించి సమగ్ర కులధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ, ఆర్.ఓ.ఆర్.1బి సర్టిఫికెట్, కంప్యూటరైజ్డ్ అడంగల్, ఓబిసి సర్టిఫికెట్, మ్యుటేషన్ టైటిల్ డీడ్, పట్టాదారు పాస్‌పుస్తకం, టైటిల్ డీడ్ ముద్రించిన కాపీ జారీ, పొసెసన్ సర్టిఫికెట్, ఇంట్లో వివాహం అయిన సభ్యుల రేషన్ కార్డు విభజన, ఇళ్ల స్థలాల పట్టాల జారీ, పట్టా సబ్ డివిజన్ ఆటో మ్యుటేషన్, నోఎర్నింగ్ మెంబర్ సర్టిఫికెట్, అడంగల్, 1బిలో సర్వే నెంబరు చేర్చడం, ఆధార్ నమోదుకోసం అడ్రస్ సర్టిఫికెట్ జారీ, వ్యవసాయ ఆదాయంపై సర్టిఫికెట్ తదితర ధృవీకరణ పత్రాలు ఉచితంగా జారీ చేసినట్లు వివరించారు.

**ప్రతి మండలం నుంచి రెండు బృందాలు**

జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రతి మండలం నుంచి రెండు బృందాలు ఆయా సచివాలయాల పరిధిలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించాయి. ఒక్కో మండలంలో రెండు సచివాలయాల పరిధిలో ఎంపీడీవో అధ్యక్షతన ఒక బృందం, తహశీల్దార్ అధ్యక్షతన మరొక బృందం ప్రత్యేక చొరవతో ముందుకు సాగాయి. జనాభా తక్కువగా ఉన్న సచివాలయాల పరిధిలో ఎంపీడీవో, తహశీల్దార్ సంయుక్త ఆధ్వర్యంలో ఒక్క చోటే శిబిరం నిర్వహించి ఆదాయ, కుల ధృవీకరణ పత్రాలు జారీ చేశారు. రేషన్ కార్డులు, ఆధార్ లింకేజీ, మ్యుటేషన్, వివాహ ధృవీకరణ పత్రం, కౌలు గుర్తింపు కార్డులు, ప్రభుత్వ డేటాకు సంబంధించి కుటుంబ వివరాల్లో కొంత మంది సభ్యుల పేర్ల తొలగింపు వంటి వివిధ రకాల ప్రజా సమస్యలను పరిష్కరించి ప్రజా మన్ననలు పొందారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన కార్యక్రమాలను డీఎల్‌డీవో నిర్మలా దేవి పర్యవేక్షణ బాధ్యతలు నిర్వర్తించారు.



# గ్రామపంచాయతీకి పెట్రో యాజమాన్యం వారు కంప్యూటర్లు బహుకరణ

**నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):** మేజర్ పంచాయతీ కు హేటరో యాజమాన్యం వారు సుమారు మూడు లక్షల రూపాయలు విలువ చేసే నాలుగు కంప్యూటర్లను అందజేశారు ఈ సందర్భంగా హేటరో ప్రతినిధులు జీ సుబ్బారెడ్డి కొల్లాయి రెడ్డి, రాజిరెడ్డితదితరులు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి పీవీపీ రాజశేఖర్ కు అందజేశారు. వారు మాట్లాడుతూ చైర్మన్ పార్థసారధి రెడ్డి ఆదేశాల మేరకు మండలంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టామని ఇప్పటికీ కొన్ని స్కూల్స్కు బ్యాగులు పుస్తకాలు దుస్తులు వైద్య శిబిరంలు నిర్వహించామని వీరు అన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ కోర్డినేటర్ మరియు రాష్ట్ర మౌలిక సదుపాయాలు డైరెక్టర్ వీసం రామకృష్ణ మన బాల తాతారావు తళ్ళ భార్గవ్ కాళ్ళ శ్రీను పాపారావు తిరుపతిరావు రోకల్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# మౌలిక సౌకర్యాలు లేని కృష్ణా దేవి పేట ఆర్టీసి బస్సు కాంప్లెక్స్



వర్షపు నీటితో నిండిన ప్లాట్‌ఫాం గుంతలు ఇబ్బందులు పడుతున్న ప్రయాణీకులు

**నర్సీపట్నం గొలుగొండ, కృష్ణా దేవి పేట, (విశాఖ సమాచారమ్):** ఏజెన్సీ ముఖద్వారం అయిన కృష్ణా దేవి పేట అల్లూరి బస్ స్టేషన్ లో మౌలిక వసతులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కృష్ణా దేవి పేట బస్ స్టేషన్ ద్వారా ప్రతి రోజు నర్సీపట్నం , ఏలేశ్వరం, పాడేరు డిపో ల నుంచి అనేక బస్సులు వందలాది మంది ప్రయాణికులను వారి వారి గమ్యలకు చేరుస్తుంటాయి . అలాంటి బస్ స్టేషన్ కు మన్య వీరుడు, విప్లవ జ్యోతీ అల్లూరి పేరు పెటి సక్రమంగా మౌలిక వసతులు, సౌకర్యాలు లేకపోవడం తో నిత్య ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు . కనీసం బస్ స్టేషన్ లో బస్సుల రాక పోకల సమాచార కేంద్రం లేకపోవడమే కాకుండా ఫ్యాన్ లు, మంచి నీరు, మరుగు దొడ్లు, పారిశుధ్యం సౌకర్యాలు లేకపోవడం కాకుండా బస్ స్టేషన్ ప్రాంగణం లో జిగట మట్టి తో ప్లాట్ ఫామ్ ఉండటం తో వర్షాలు పడుతుంటే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కనీసం బస్ ల రాకపోకల నిర్ణీత పట్టిక కూడా ఏర్పాటు చేయకపోవడం బాధాకరమని ప్రయాణికులు వాపోతున్నారు. బస్ స్టేషన్ ప్రాంగణం లో ఉన్న సుమారు 8 షాప్ లకు అద్దెల రూపేణ వేలాది రూపాయలు ఆర్టీసి వసూలు చేస్తుందని కనీసం ఆ డబ్బులు బస్ స్టేషన్ అభివృద్ధికి వినియోగించిన సమస్య పరిష్కారం అవుతుంది అని ప్రయాణికులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ విషయమై గతంలో ప్రస్తుత నర్సీపట్నం డిపో మేనేజర్ వారి దృష్టికి తీసుకువెల్లామని అయిన ఎటువంటి ఫలితం దక్కలేదని ఇప్పటికైనా స్థానిక నర్సీపట్నం డీ. ఎం స్పందించి ప్రయాణికులు సమస్యలు పరిష్కరిస్తారని కోరుతున్నాము.

# రైతులతో పాటు కౌలు రైతులకు పంట రుణాల మంజూరు ప్రక్రియ వేగవంతం చేయాలి

**కాకినాడ , (విశాఖ సమాచారమ్):** జిల్లాలో సొంత భూమి కలిగిన రైతులతో పాటు కౌలు రైతులకు పంట రుణాల మంజూరు ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. కృతికాశుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టరు డా. కృతికా శుక్లా.. జాయింట్ కలెక్టరు ఎస్ ఇలక్కియ, ఇతర జిల్లా స్థాయి అధికారులతో కలిసి సీసీఆర్సీ కార్డులు పంపిణీ, పంట రుణాలు మంజూరు, ఓటర్ల జాబితా తనిఖీ, గ్రాస్ ఎన్రోల్మెంట్ సర్వే, వాలంటీర్ల ఎడ్యుకేషన్ సర్వే, జేవీకే కిట్లు పంపిణీబీ ప్రభుత్వ శాశ్వత భవనాల నిర్మాణాల వంటి అంశాలకు సంబంధించిన పురోగతిని క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కృతికా శుక్లా మాట్లాడుతూ ఇప్పటివరకు జిల్లాలో 94 శాతం సీసీఆర్సీ కార్డులు పంపిణీ పూర్తి చేయడం జరిగిందన్నారు. ఇంకా అర్హత కలిగిన కౌలు రైతులను గుర్తించి ఈ వారంలో సీసీఆర్సీ కార్డుల పంపిణీ పూర్తిచేయాలని ఆమె తెలిపారు. ప్రధానంగా సొంత భూమి కలిగిన రైతులతో పాటు కౌలు రైతులకు పంట రుణాల మంజూరు ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. వ్యవసాయ అధికారులు బ్యాంకు అధికారులతో సమన్వయం చేసుకొని పంట రుణాలు మంజూరు నూరు శాతం పూర్తయ్యే విధంగా ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. జిల్లాలో గత 21న ప్రారంభించిన ఓటర్ల జాబితా ఇంటింటి తనిఖీని ప్రణాళికాయుతంగా చేపట్టాలన్నారు.



వాలంటీర్ ఎడ్యుకేషన్ సర్వే, గ్రాస్ ఎన్రోల్మెంట్ సర్వే వివరాలు ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో నమోదు చేయాలని కలెక్టరు తెలిపారు. జిల్లాలో నిర్మాణం లో ఉన్న భవనాలను ఈ నెల 15న ప్రారంభించే విధంగా చివరి దశ పనులను పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ శాశ్వత భవనాలకు సంబంధించి గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైయస్సార్ విలేజ్ క్లినిక్ భవన నిర్మాణ పనులలో పురోగతి కనబరచాలన్నారు. పనులు పూర్తయిన వెంటనే బిల్స్ అప్లోడ్ చేసేవిధంగా అధికారులు దృష్టి పెట్టాలని, పూర్తయిన భవనాలను అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టరు కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో డీఆర్వో కె.శ్రీధర్ రెడ్డి, పశుసంవర్ధక శాఖ జేడీ ఎస్ సూర్యప్రకాశరావు, ఇన్చార్జ్ డీఈవో జీ.నాగమణి, పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎం. శ్రీనివాసు, ఎల్డీఎం ప్రసాద్,కాకినాడ, పెద్దాపురం డీఎల్డీవోలు పి.నారాయణ మూర్తి, కెఎస్వీఎస్ ప్రసాద్ రాజు ఇతర అధికారులు అధికారులు పాల్గొన్నారు.


మెగా బ్రాహ్మణ వివాహ వేదిక

తెలుగు బ్రాహ్మణ వధూవరుల

వివాహ పరిచయ కార్యక్రమం

విశాఖ సమాచారమ్ దినపత్రిక కార్యాలయం

9-3-16, పిఠాపురం కోలనీ, (కృష్ణా కాలేజ్ జంక్షన్, మెయిన్‌రోడ్డు) విశాఖపట్నం-530003



తేది : 06-8-2023, (ఆదివారం)

సమయం : మధ్యాహ్నం గం. 2.00 ల నుండి సాయంత్రం గం. 5.00 వరకు.

శ్రీకాకుళం నుండి విజయవాడ వరకు,

హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, చెన్నై,

బెంగుళూరు, పూణే వంటి ప్రముఖ

నగరాలలో పనిచేస్తున్న సుమారు

500 మంది వధూవరుల వివరములతో...

రిజిస్ట్రేషన్ మరియు వివరముల కొరకు

జనహిత మ్యాట్రిమోనీ

:9393949345, 8074541283

Compli


VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839
Hyderabad : Cell : 9030841841, Kakinada : Cell: 7013118088, Simhachalam : Cell: 96660 15921, Pardwada : Cell: 77804 33919, Aarilova : Cell: 97050 51389,
Cheedikaada : Cell: 97686 33999, Vsp City : 8885687610, VSP : 7981904385.